# ఒక ఉద్యమం, పది అబద్ధాలు

- అబ్రకదబ్ర

http://anilroyal.wordpress.com

'We must all hang together, or assuredly, we shall all hang separately' – *Benjamin Franklin*

'కలసి ఉంటే కలదు సుఖం' - *ఆర్యోక్తి*

ప్రాంతీయ అసమానతల నెపంతో విద్వేషాలు రెచ్చగొట్టి తెలుగు జాతిని రెండుగా చీల్చి పబ్బం గడుపుకోజూస్తున్న దొంగ నాయకుల పన్నాగాలకు నేడు ఆంధ్రప్రదేశ్ బలిపీఠమ్మీద నిలబడి బెదురు చూపులు చూస్తుంది. 'ఆంధ్రావాలే భాగో' దగ్గర మొదలై 'మాకెదురాడిన వారి నాలుకలు తెగ్గోస్తాం' అనేదాకా, ఓ పార్లమెంటు సభ్యుడి తలకే వెలకట్టే దాకా, 'రాజధాని నుండి ముప్పై లక్షల మంది ఆంధ్రా ప్రాంతీయులని పారదోలతాం', 'సంక్రాంతికి ఊర్లకి వెళ్లినవారిని తిరిగి రానీయం' అంటూ పెట్రేగిపోయేదాకా వచ్చింది వేర్పాటువాదుల విచ్చలవిడితనం. ఆ క్రమంలో వాళ్లు తెలంగాణ తాలిబాన్లుగా రూపాంతరం చెంది హైదరాబాదులో సాగించిన, సాగిస్తున్న అరాచకం తాజా పరిణామం. స్వకార్యాలు చక్కబెట్టుకునే దురాలోచనతో 'ఆంధ్రోళ్లు దోపిడీదార్లు' అంటూ విద్యార్ధుల ముసుగులోని తెలబాన్లు, మేధావుల పేరుతో వారిని రెచ్చగొడుతున్న ప్రబుద్ధులూ, వీరందరి వెనకున్న రాజకీయ నాయకులూ సాగిస్తున్న దుష్ప్రచారానికి అడ్డూ అదుపూ లేకుండా పోయింది. వేర్పాటువాదుల దాడుల భయంతోనో, మరే ఇతర వ్యాపార కారణాలతోనో రాష్ట్రంలో మెయిన్‌స్ట్రీమ్ మీడియా సైతం వేర్పాటువాదానికి ఊతమిచ్చే వార్తలకి ఇస్తున్న ప్రాధాన్యత వారు ప్రచారం చేస్తున్న అవాస్తవాలనీ, అబద్ధాలనీ ఎండగట్టటానికి ఇవ్వకపోవటం శోచనీయం. ఈ పరిస్థితుల్లో నిజానిజాల నిగ్గుదేల్చే బాధ్యత మనలాంటివారు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

'తెలంగాణవాసులు అమాయకులు. అదే అలుసుగా ఆంధ్రోళ్లు వాళ్లని దోచుకుంటున్నారు' అన్నది వేర్పాటువాదుల ప్రధాన ఆరోపణ. అందులో కొంత నిజముండకపోలేదు – తెలంగాణవాసుల అమాయకత్వం వరకూ. ఆ అమాయకత్వం మూలానే ఇంటి దొంగల మాటలు గుడ్డిగా నమ్మేసి సాటి తెలుగువారిపై అకారణ ద్వేషం పెంచుకుంటున్నారు ఎందరో తెలంగాణ ప్రజలు. అటువంటివారికి అసలు విషయాలు వివరించి వేర్పాటువాదుల దుష్ప్రచారాన్ని ఎదుర్కోవటానికి ఉద్దేశించినది ఈ సుదీర్ఘ వ్యాసం. దీనికోసం సమాచారం అందించిన వారెందరో ఉన్నారు. వారందరికీ ధన్యవాదాలు.

గత దశాబ్దంలో వేర్పాటువాదులు విస్తారంగా ప్రచారంలోకి తీసుకొచ్చిన కొన్ని అబద్ధాలు, వాటికి సంబంధించిన అసలు నిజాలు – కింద. ఇవన్నీ చదవండి, మరో పదుగురితో చదివించండి. నిజమేమిటో అర్ధం చేసుకోండి, మరింతమందికి వివరించండి. ఆ పని చేయటానికి మీరు తెలంగాణవాసులా, కోస్తాంధ్రవాసులా లేక సీమవాసులా అన్నదానితో సంబంధం లేదు. మీ ప్రాంతమేదైనా, రాజకీయ రాబందుల స్వార్ధ నాటకాలకి తెలుగుజాతి బలి కాకూడదని కోరుకునేవారైతే చాలు.

మరో మాట – ఈ వ్యాసం ఉద్దేశం వేర్పాటువాదుల ఆరోపణల అంతుచూడటం. ఇది రాష్ట్రం విడిపోవాలా వద్దా అన్నది తేల్చే వ్యాసం కాదు. తెలంగాణవాసులపై కోపతాపాలు వ్యక్తం చేసే ప్రయత్నం అసలే కాదు. వేర్పాటు పేరుతో ఉచితానుచితాలు మరిచి ఓ ప్రాంతంవారిపై కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని అడ్డుకునే ప్రయత్నం మాత్రమే.

**ఒకటో అబద్ధం:**

తెలంగాణ జిల్లాల్లో ఏడు వెనకబడి ఉండగా, రాయలసీమలో ఒకటి, కోస్తాంధ్రలో మూడు మాత్రమే వెనకబడ్డాయి.

**ఇదీ నిజం:**

తెలంగాణ జిల్లాలు: ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం, మెదక్, రంగారెడ్డి, నల్గొండ, మహబూబ్‌నగర్, హైదరాబాద్. వీటిలో హైదరాబాద్, మెదక్, రంగారెడ్డి, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం వెనకబడ్డ జిల్లాల లెక్కలోకి రావు. నిజంగా వెనకపడ్డవి ఆదిలాబాద్, వరంగల్, నల్గొండ మరియు మహబూబ్‌నగర్ మాత్రమే. అనగా నాలుగు జిల్లాలే. మిరి మిగిలిన మూడూ ఏవి?

రాయలసీమ జిల్లాలు: కర్నూలు, కడప, చిత్తూరు, అనంతపురం. వీటిలో చిత్తూరులో కొన్ని ప్రాంతాలూ, కడప జిల్లా పూర్తిగానూ వెనకబడ్డ ప్రాంతాలు. ఇక అనంతపురం జిల్లా రాష్ట్రంలోనే అత్యంత వెనకబడ్డ ప్రాంతం. వేర్పాటువాదుల లెక్కన మాత్రం రాయలసీమ మూడు జిల్లాల్లో జరిగేది రతనాల సాగే!

కోస్తాంధ్ర జిల్లాలు: నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం. వీటిలో విజయనగరం, విశాఖపట్నం (వైజాగ్ సిటీ మినహాయించి), గుంటూరు జిల్లాలో పల్నాడు ప్రాంతం, ప్రకాశం జిల్లా మొత్తం, గోదావరిలో మన్యం పాంతం, శ్రీకాకుళం జిల్లా మొత్తం, కృష్ణా జిల్లా పశ్చిమ ప్రాంతం వెనుకబడ్డ ప్రాంతాలు. ఉన్న తొమ్మిది జిల్లాల్లో మూడు పూర్తిగానూ, మరో నాలుగు పాక్షికంగానూ వెనకబడే ఉండగా కోస్తాంధ్ర అభివృద్ధిని తట్టుకోలేక అల్లాడిపోతుందనేది వేర్పాటువాదుల ప్రచారం!

ఇక్కడ కనిపిస్తుందంతా – వెనకబాటుదనం పేరుతో వేర్పాటువాదులు నోటికొచ్చినట్లు చెబుతున్న అంకెలే. తెలంగాణ, కోస్తాంధ్ర, రాయలసీమల్లో వెనకబడ్డ ప్రాంతాల శాతాలు ఎంతెంత? మీరే తేల్చుకోండి.

'వెనకబాటుదనం' గురించిన మరో ఆసక్తికరమైన విషయం. 2001 జనాభా లెక్కల ఆధారంగా రెండేళ్ల కిందట జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో పదమూడు అసెంబ్లీ సీట్లు గల్లంతవగా తెలంగాణ ప్రాంతంలో (ముఖ్యంగా హైదరాబాదు చుట్టుపక్కల) అవే సంఖ్యలో అసెంబ్లీ సీట్లు పెరిగాయి. కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల నుండి రాజధానికి వలసలు పెరిగిపోవటం దీనిక్కారణం. అభివృద్ధి ఉన్నచోటే అవకాశాలు అధికంగా ఉంటాయనీ, అవకాశాలున్న చోటికే వలసలు వెల్లువెత్తుతాయనీ అర్థం చేసుకోటానికి అర్థశాస్త్రాన్ని ఔపోసన పట్టనవసరం లేదు.

రాష్ట్రంలో నిజమైన అభివృద్ధి ఏదన్నా ఉందంటే అది తెలంగాణకి గుండెకాయ వంటి హైదరాబాదులోనూ, ఆ మహానగరం చుట్టుపక్కలా మాత్రమే కేంద్రీకృతమయ్యింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా నలభై రెండు మంది పార్లమెంటు సభ్యుల బలంతో గత యాభయ్యేళ్లలో కేంద్రం నుండి మంజూరు చేయించుకున్న ప్రాజెక్టులు, ఇతరత్రా మరెన్నో సదుపాయాలు తెలంగాణ ప్రాంతంలోనే కుప్పపోయటం దీనిక్కారణం.

వాటిలో కొన్ని: బిహెచ్ఇఎల్, ఈసీఐఎల్, ఎన్ఐఎన్, డిఆర్డివో ప్రయోగశాల, దక్షిణ మధ్య రైల్వే, సెంట్రల్ యూనివర్సిటీ, ఐఐటీ, ఐఎస్‌బి, రీజినల్ ఇంజినీరింగ్ కాలేజ్ (వరంగల్), హైటెక్ సిటీ, ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్. ఈ జాబితాకి అంతులేదు.

'హైదరాబాద్ యాభయ్యేళ్ల కిందటే అభివృద్ధి చెందిన ప్రాంతం, కొత్తగా వచ్చిన అభివృద్ధేమీ లేదక్కడ' అనే మహానుభావులు ఉన్నారు. '1937 ప్రాంతంలో అప్పటి నిజాం ఉస్మాన్ ఆలీ ఖాన్ ప్రపంచంలోనే అత్యంత ధనికుడుగా పేరొందాడు. ఇది చాలదా అప్పట్లోనే తెలంగాణ ఎంత సంపన్న ప్రాంతమో చెప్పటానికి' అనేది తమ వితండవాదనకి సమర్ధనగా వారు చూపే హాస్యాస్పద కారణం. ఒక్కడి సంపద ఓ ప్రాంత సౌభాగ్యం మొత్తానికీ టోకు సూచికైతే అంతర్జాతీయంగా అపర కుబేరుల జాబితాలో పైస్థానాలు అలంకరించిన అంబానీలని చూపి భారత దేశం ప్రపంచంలోనే అత్యంత సంపన్న దేశాల్లో ఒకటి అనాల్సిందే!

మరో పక్క - కోస్తాంధ్రలోనైనా, రాయలసీమలోనైనా గడచిన యాభయ్యేళ్లలో ప్రభుత్వం నెలకొల్పిన చెప్పుకోదగ్గ ప్రాజెక్టులు కానీ పరిశ్రమలు కానీ ఒక్కటీ లేవు – కొనప్రాణంతో కొట్టుకులాడుతున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ మినహా. నౌకాశ్రయం ఉన్నదన్న కారణంతోనే ఆ ఒక్కటీ దక్కింది తప్ప; హైదరాబాద్ సముద్రం ఒడ్డున ఉండుంటే ఉక్కు ఫ్యాక్టరీ సైతం తెలంగాణలోనే నెలకొల్పబడేదనటం అతిశయోక్తి కాదు. రాష్ట్రానికి గుంటూరు విద్యాకేంద్రం, విజయవాడ వాణిజ్యకేంద్రం అనేవి ఒకప్పటి మాటలు. ఇప్పుడా రెండు హోదాలూ హైదరాబాదుకే దఖలు పడ్డాయి. ఏ అభివృద్ధికి సూచికలివి? అప్పటికీ ఇప్పటికీ కోస్తాంధ్ర వ్యవసాయాధారితమే. కొత్తగా వచ్చిన అభివృద్ధేమిటి? ఓ ఏడాది వరదలకి అతలాకుతలమైనా, మరుసటేడాది నీళ్లు లేక పంటలు ఎండిపోయినా కోస్తాంధ్ర రైతులు కన్నీళ్లు దిగమింగారే తప్ప వేర్పాటువాద పల్లవందుకోలేదే. రమారమి వెయ్యి కిలోమీటర్ల పొడుగున దేశంలోనే రెండవ పొడవైన తీరప్రాంతమున్నా, అంతర్జాతీయ జలాలకి అతి సమీపంలో ఉండి నౌకా రవాణాకి అత్యంత అనువుగా ఉన్నా కోస్తాంధ్ర ప్రాంతంలో అంతర్జాతీయ స్థాయి ఓడరేవులెన్ని? ఈ విషయంలో గుజరాత్‌తో పోటీ పడాల్సిన తమ ప్రాంతం అంతగా వెనకబడిపోటానికి 'పాలకులు హైదరాబాదుపైనా, దాని పరిసర తెలంగాణ ప్రాంతాల పైనా చూపిన ప్రేమ తమపై చూపకపోవటమే కారణం' అంటూ కోస్తాంధ్రవాసులు విడిపోతామనలేదేం? ఇక రాయలసీమ – రాష్ట్రానికి అత్యధిక కాలం ఇక్కడివారే ముఖ్యమంత్రులుగా వెలిగిపోయినా ఈ ప్రాంతం యాభయ్యేళ్లుగా రాళ్ల సీమే, బీళ్ల సీమే. మరి పౌరుషాల సీమ ప్రజ తమ నిర్భాగ్యానికి పొరుగువారిని నిందించటం లేదే.

కల్లబొల్లి కబుర్లొపక్క, కళ్లెదురుగా ఉన్న నిజాలో పక్క. ఆలోచించండి – గత అర్ధ శతాబ్దిలో ఏ ప్రాంతంలో ఎక్కువ అభివృద్ధి జరిగిందో.

**రెండో అబద్ధం:**

ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి యాభయ్యేళ్ల చరిత్రుంది

**ఇదీ నిజం:**

అనగనగా 1985 ప్రాంతంలో హీరో కృష్ణ నటించి నిర్మించిన 'సింహాసనం' అనబడే జానపద చిత్రరాజం విడుదలైన రోజులవి. దక్షిణ భారతంలో తొట్టతొలి 70 ఎం.ఎం. సినిమాగా భారీ అంచనాల నడుమ విడుదలైన సినిమా కావటం చేతనూ, కృష్ణ తొలిసారి దర్శకత్వం వహించిన చిత్రం కావటం చేతనూ ఆ సినిమా విజయమ్మీద విడుదలకు ముందే అంచనాలు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయాయి. అప్పట్లో కొత్త సినిమాలు జిల్లా కేంద్రాల్లోనూ, జిల్లాలోని ఒకట్రెండు ప్రముఖ కేంద్రాల్లోనూ మాత్రమే విడుదలయ్యేవి. విడుదలయ్యాక, సినిమా జయాపజయాలనిబట్టి బి, సి కేంద్రాలకు యాభై రోజుల తర్వాతనో, వంద రోజుల తర్వాతనో వచ్చేవి. ఆ ఆనవాయితీకి భిన్నంగా సింహాసనం చాలా బి, సి కేంద్రాల్లో సైతం విడుదలయింది. అలాంటివాటిలో పల్నాడు ప్రాంతంలోని మాచర్ల ఒకటి.

మాచర్లలో 'సింహాసనం' వారం రోజులు ఆడించాక అక్కడినుండి ఎత్తేయబడింది. తిరిగి నలభై తొమ్మిదో రోజునుండి రెండు రోజులు వరసగా ప్రదర్శించబడి మళ్లీ ఎత్తేయబడింది. ఆ తర్వాత నూరవ రోజున మొక్కుబడిగా రెండాటలు ప్రదర్శించబడింది. మొత్తమ్మీద మాచర్లలో ఆ సినిమా ఆడింది పది రోజులు. 'సింహాసనం' శత దినోత్సవ కేంద్రాల జాబితాలో మాత్రం ఆ ఊరు సగర్వంగా చోటు చేసుకుంది!

అయ్యా, అదీ సంగతి. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ 'యాభయ్యేళ్ల చరిత్ర' లెక్క సింహాసనం సినిమా నూర్రోజుల కేంద్రాల లెక్కకి ఏ మాత్రం తీసిపోదు. ఆ లెక్కా డొక్కా చూద్దాం పదండి.

అసలీ ప్రత్యేక ఉద్యమ చరిత్ర విషయంలో అనేక అంకెలు చలామణిలో ఉన్నాయి. కొందరది అరవయ్యేళ్లుగా ఉందంటారు, ఇంకొందరి లెక్కన యాభయ్యేళ్లు, మరి కొందరి లెక్కలో నలభయ్యేళ్లు. నిజానికి తాజా ఉద్యమానికి నిండా తొమ్మిదేళ్లు లేవు – అదీ పడుతూ లేస్తూ.

అరవయ్యేళ్లకి ముందు ఆంధ్రప్రదేశ్ లేదు, కనీసం ఆంధ్ర రాష్ట్రమూ లేదు. మరి అప్పుడే ప్రత్యేక ఉద్యమం ఎక్కడి నుండొచ్చిందో అడిగే వారు లేరు, చెప్పేవారూ లేరు. ఇదో అబద్ధపు లెక్క. దీనికి ఇంతకన్నా వివరణ అనవసరం.

యాభయ్యేళ్ల కిందట – 1959లో – ప్రత్యేక తెలంగాణ కోసం ఏ ఉద్యమమూ జరిగిన దాఖలాల్లేవు. అదీ అబద్ధపు లెక్కే. మొదటి తెలంగాణ ఉద్యమం మొలకెత్తింది 1969లో. రెండేళ్లు, మూడొందల అరపై మంది అమాయకుల నిండు ప్రాణాల అనంతరం దాన్ని రెచ్చగొట్టిన నాయకుల పబ్బం గడవటమూ, వెనువెంటనే ఆ ఉద్యమం నీరుగారిపోవటమూ జరిగిపోయాయి. ఇది అందరికీ తెలిసిన చరిత్రే. 'ప్రజల ఆకాంక్షలోంచి పుట్టుకొచ్చిన ఉద్యమమైతే నాయకుల అవసరాలు తీరగానే ఎందుకు సద్దుమణిగింది?' – ఇది ప్రత్యేకవాదులు వాళ్లని వాళ్లు వేసుకోవలసిన ప్రశ్న.

నాటి ఉద్యమం నాయకుల ముద్దు బిడ్డేనన్నది దాస్తే దాగే రహస్యం కాదు. దానికి రుజువు – అది చల్లారిన ఏడాదికే లభించింది. 1972లో ముల్కీ నిబంధనలకి వ్యతిరేకంగా 'జై ఆంధ్ర' ఉద్యమం తీవ్రస్థాయిలో జరిగినప్పుడు ఆంధ్రప్రదేశ్‌కి ముఖ్యమంత్రిగా ఉంది ఓ తెలంగాణ ప్రాంతీయుడే. 1969 తెలంగాణ ఉద్యమం ప్రజల ఆకాంక్షల మేరకే జరిగినట్లైతే, ఆ ఉద్యమం వేడి ఇంకా చల్లారకుండా ఉన్నట్లైతే ఆంధ్రప్రదేశ్‌ని ముక్కలు చెయ్యటానికి 1972ని మించిన తరుణం మరేముంది? ప్రస్తుతం చిక్కుముడిగా మారిన హైదరాబాద్‌ని అప్పట్లో 'జై ఆంధ్రా' వాదులు అడగలేదు కూడా. 'జై ఆంధ్రా'కి మద్దతుగా ఇవతల 'జై తెలంగాణ' ఎందుకు రాజుకోలేదు? 'అన్నదమ్ముల్లా విడిపోదాం' అని చిలకపలుకులు పలికేవాళ్లు అలా విడిపోగలిగిన ఒక్క అవకాశాన్నీ ఎందుకు వదులుకున్నారు? 1972 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యేకవాదంతో 40 చోట్ల పోటీ చేసిన ఎస్‌టీపీఎస్ (సంపూర్ణ తెలంగాణ ప్రజా సమితి) అభ్యర్ధుల్లో ఒక్కరు తప్ప మిగతా వాళ్లందరూ మట్టికరవటం, మిగిలిన వారిలో 28 మంది డిపాజిట్లు సైతం కోల్పోవటం దేనికి సూచిక? ఈ రోజు తెలంగాణవారిలో ఆంధ్రావారిపై వెల్లువెత్తుతున్న ఆవేశకావేషాలు ఎప్పట్నుండో ఉన్నవేనైతే గత రెండు దశాబ్దాల్లో ఆంధ్రా, సీమ వాసులు వేలం వెర్రిగా హైదరాబాదులో పెట్టుబడులెందుకు పెడతారు? 'విడిపోయి మా బ్రతుకు మేం బ్రతుకుతాం, మా అభివృద్ధి మేమే చేసుకుంటాం' అని ఈనాడు గొంతులు చించుకుంటున్న వేర్పాటువాదులు ఆంధ్రప్రదేశ్ రాజధాని హోదాలో హైదరాబాదుకి వెల్లువలా పరిశ్రమలూ, ప్రాజెక్టులూ వచ్చిపడుతున్నప్పుడు ఏమైపోయారు? నలభయ్యో, యాభయ్యో, అరవయ్యో ఏళ్లుగా ఉద్యమం సాగుతూనే ఉన్నప్పుడు, తెలంగాణ స్థానికుల్లో 'ఆంధ్రా దోపిడీదారుల'పై నిరసన సెగలు రేగుతూనే ఉన్నప్పుడు ఆంధ్రా పెట్టుబడిదారుల 'దండయాత్ర'ని ఎప్పటికప్పుడు ఎందుకు అడ్డుకోలేదు? ఏనాటికైనా విడిపోక తప్పకపోతే ఆనాడు ఇవన్నీ విప్పలేని చిక్కుముడులవుతాయని తెలియదా?

ఈ ప్రశ్నలకి సమాధానం చెప్పటం అతి సులువు. ఈ ప్రత్యేక భావనలు ప్రజల్లో ప్రబలంగా లేవు. తమ తమ ప్రాంతాలకి జరుగుతున్న అన్యాయాలపై ఇరు ప్రాంతాల్లోనూ నిరసనలున్నాయి. అందర్నీ అన్ని వేళలా సంతృప్తి పరచటం కుదిరే పని కాదు కాబట్టి ఇలాంటివి ఎప్పుడూ ఉంటూనే ఉంటాయి. వాటి కోసం రాష్ట్రాలూ, దేశాలూ విడిపోవాలన్న ఆలోచనలు ప్రజల మదుల్లో వాటంతటవే పుట్టుకు రావు. 'జై తెలంగాణ', 'జై ఆంధ్రా' అంటూ రాష్ట్రాన్ని విడగొట్టే ఆలోచనలు ప్రజల్లోంచి పుట్టుకొచ్చినవి కావు – ఎవరి లెక్కలు వాళ్లేసుకునే కొందరి మస్తిష్కాల్లోంచి మొలుచుకొచ్చినవి.  కాబట్టే అవి ఎంత హఠాత్తుగా పుట్టాయో అంత హఠాత్తుగానూ పడకేశాయి. అవసరం మేరా ఉద్యమాలని వాడుకుని అది తీరాక వాటిని అటకెక్కించటం ప్రపంచవ్యాప్తంగా నాయకులకి వెన్నతో పెట్టిన విద్య. మూడు దశాబ్దాల తర్వాత – ఆ విద్యని నేటి తరం తెలుగు రాజకీయ రాబందుల్లో రెండాకులు ఎక్కువ చదివిన మహానుభావుడొకడు మహత్తర రీతిలో ప్రదర్శించదలచుకోవటంతో తెలంగాణ లొల్లి పేరిట తాజా నాటకానికి మరోమారు తెర లేచింది.

మంత్రి పదవి రాలేదని అలిగిన ఈ మహాదొర తెలంగాణ జెండా భుజానేసుకుని అక్కడి జనాలని ఉన్నపళాన ఉద్ధరించేస్తానంటూ బయల్దేరింది 2001లో. ఉద్యమ పార్టీగా చెప్పుకుంటున్న ఆయన పక్షం ఆ తర్వాత జరిగిన ఏ ఎన్నికల్లోనూ ఏకపక్ష విజయాలు సాధించింది లేదు. పైగా, ఆ పార్టీ ప్రతిష్ట నానాటికీ తీసికట్టుగా మారి 2009 సాధారణ ఎన్నికలనాటికి ఎవరు తోడొస్తే వారితో జట్టుకట్టటానికి ఆవురావురుమనే దశకొచ్చి, ఎన్నికల ఫలితాల తర్వాత ఆ పార్టీకే కాక వారితో జట్టు కట్టిన పక్షానికీ తల బొప్పి కట్టిన చరిత్ర ఇంకా తాజాగానే ఉంది. ప్రత్యేక రాష్ట్ర సాధనే ఏకైక అజెండాగానూ, విడిగా ఎన్నికల మ్యానిఫెస్టో సైతం లేకుండానూ ఎన్నో ఎన్నికల్లో పోటీ చేసిన ఈ పార్టీ ప్రతిసారీ ఓటమికి చెప్పే కుంటి సాకు 'ఈ ఎన్నికల్లో ఓటింగ్ సరళిని స్థానిక అంశాలే ప్రభావితం చేశాయి

తప్ప రాష్ట్ర సాధన కాదు'! తెలంగాణ ప్రజలకి ప్రత్యేక రాష్ట్ర సాధన ఏమంత ప్రధానమైన విషయం కాదని వీళ్ల మాటల్లోనే తేలిపోవటం లేదా?

ఇంతెందుకు - ఈ రోజు ఏ హైదరాబాదైతే 'మాదే' అంటూ తాజా చిచ్చు కారకులు గాండ్రిస్తున్నారో, సాక్షాత్తూ ఆ గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో పోటీ చేసే దమ్ము లేక వాళ్లు తోక ముడిచిన వైనం సైతం నిన్నా మొన్నటిదే. ఇదీ – 'ఉద్యమానికి నవ ఊపిరులూదిన పార్టీ' భంగ చరిత్ర, తెలంగాణలో వాళ్లకున్న అసలైన బలం. తమ బలం సన్నగిల్లటం చూసి కలవరపడి, ఆఖరి యత్నంగా వేర్పాటువాదులు విసిరిన పాచిక – విభజించి పాలించటం. ప్రజల మధ్య ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టి పనులు చక్కబెట్టుకోవటం వీళ్ల తాజా తంత్రం. వీళ్లకి తోడు విద్యార్ధులని రెచ్చగొట్టే ప్రొఫెసర్లూ, మేధావుల ముసుగులోని వామపక్ష తీవ్రవాదుల సానుభూతిపరులూ. తరాలుగా సాగుతున్న ఉద్యమం అంటూ అమాయకులని మభ్యపెట్టటానికి వీళ్లు కలసికట్టుగా ప్రచారం చేస్తున్న అబద్ధమే ఉద్యమ చరిత్రకి సంబంధించిన కాకి లెక్కలు.

వేర్పాటువాదులు చెబుతున్నట్లు తెలంగాణ ఉద్యమానికి దశాబ్దాల చరిత్రే ఉందని ఒప్పుకున్నా- అసాధ్యమైన లక్ష్యాల కోసం ఏళ్లూ పూళ్లూ ఏకధాటి ఉద్యమాలు నడిపే బదులు, వీళ్లు పదే పదే ప్రస్తావించే పెద్ద మనుషుల ఒప్పందం, 610 జీవోల అమలు గురించి ఆ స్థాయిలో ఉద్యమాలు చేపడితే ఎవరొద్దంటారు? వాటి కోసం ఈ మహానుభావులు ఎప్పుడన్నా కనీసం ఉత్తుత్తి దీక్షలన్నా చేశారా? వీళ్లకి కావలసింది సమస్యలు తీరటం కాదు – అవి నిక్షేపంగా కొనసాగటం. తమ స్వార్ధాల కోసం ఉన్న సమస్యల్ని ఎక్కువ చేసి చూపటానికీ, కొత్త సమస్యలు సృష్టించటానికీ వీళ్లు తయార్. ఒకవేళ తెలంగాణ విడిపడ్డా ఈ రాబందుల రెక్కల చప్పుడు కిందే మనవలసి ఉంటే - వేరయినా ఒరిగేదేమిటి? అర్ధం చేసుకోవటానికదో బ్రహ్మ రహస్యం కాదు. దానిక్కావలసిందల్లా వాస్తవాలని స్వీకరించే గుణం. అది మీకుందా?

**మూడో అబద్ధం:**

రాష్ట్రానికి సగం ఆదాయం సమకూరుస్తున్న తెలంగాణకి, ఆ నిధుల్లో దక్కే వాటా అత్యల్పం

**ఇదీ నిజం:**

ఈ లెక్కలు ఒక్కో కథలో ఒక్కో రకంగా ఉంటాయి. మొత్తమ్మీద – తెలంగాణ నుండి సమకూరే ఆదాయం 45% నుండి 55% దాకానూ, అందులో తెలంగాణకి లభించే వాటా 20% నుండి 30% దాకా మాత్రమే అనీ కనిపిస్తుంది. శాతాల సంఖ్యలో వాస్తవాలటుంచి ప్రత్యేకవాదుల వాదనే నిజమనుకుంటే ఓ పెద్ద తిరకాసు కనిపిస్తుందందులో. వేర్పాటుకి వాళ్లు చెప్పే ప్రధాన కారణం తెలంగాణ వెనకబాటుదనం. అంత వెనకబడ్డ ప్రాంతం నుండి రాష్ట్ర ఖజానాకి అత్యధిక ఆదాయం సమకూరటం – ఎలా సాధ్యం?

సాధ్యాసాధ్యాలెలా ఉన్నా, ప్రత్యేకవాదుల గడుసుదనానికిదో తిరుగులేని ఉదాహరణ. ఆదాయం లెక్కలేసేటప్పుడు హైదరాబాదుని తెలంగాణలో భాగంగా భావించటమూ, ఖర్చుల దగ్గరికొచ్చేసరికి హైదరాబాదుని తీసేసి మిగతా తెలంగాణ జిల్లాలని గురించి మాత్రమే మాట్లాడటమూ వీళ్లకలవాటు. వాళ్లు పైన చెప్పిన 'తెలంగాణ ఆదాయం'లో అత్యధిక శాతం హైదరాబాదు మహానగరం, మరియు దాని పరిధిలోని మెదక్, రంగారెడ్డి జిల్లాల్లోని వివిధ పరిశ్రమలు, వ్యాపారాలు, ఐటీ ఇండస్ట్రీ, సినిమా ఇండస్ట్రీ, రియల్ ఎస్టేట్ ఇత్యాధి రంగాల నుండే వస్తుందన్నది గమనార్హం. ఆయా రంగాల్లో (ఐటీ రంగాన్ని మినహాయిస్తే) కోస్తాంధ్ర, రాయలసీమ పెట్టుబడిదారుల యాజమాన్యంలో ఉన్నవే ఎక్కువన్నదీ గమనార్హం. ఉమ్మడి రాజధానిగా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజల పెట్టుబడుల నుండి వచ్చిన ఆదాయాన్ని తెలంగాణ ప్రాంతపు ఆదాయంగా చూపించటమూ, ఆ ఆదాయమంతా మిగతా తెలంగాణ జిల్లాల్లో మాత్రమే ఖర్చు పెట్టాలనటమూ న్యాయమేనా?

ఇప్పుడు వేర్పాటువాదులు 'తెలంగాణ ఆదాయం'లో అత్యధికం హైదరాబాదు నుండే వస్తుందనన్నా ఒప్పుకోవాలి, లేదా తెలంగాణ వెనకబడలేదనన్నా ఒప్పుకోవాలి. మొదటిది ఒప్పుకుంటే – హైదరాబాదు రెవిన్యూ చెందితే హైదరాబాదు నగరానికి మాత్రమే చెందాలి, లేదా రాష్ట్రం మొత్తానికీ సమానంగా చెందాలి అన్న వాదనొస్తుంది. రెండోది ఒప్పుకుంటే – వేర్పాటుకి ప్రాతిపదికే లేదు. కాబట్టి వాళ్లు చేసే పని .. అసలు నిజాలు దాచి రాజధాని నగరం సమకూర్చే ఆదాయాన్ని తెలంగాణ ఆదాయంగా అబద్ధపు ప్రచారం చెయ్యటం, అందులో సింహభాగం తెలంగాణకి చెందటం లేదని గగ్గోలు పెట్టటం. ఏం తెలివి!

తమాషా ఏంటంటే - తమ సొమ్ము దగ్గరికొచ్చేసరికి ఎవరి సొమ్ము వారిదే అనే ఈ వేర్పాటువాదులు, పక్క ప్రాంతాల సొమ్ము తెలంగాణకి ఉపయోగపడటం గురించి అడిగితే మాత్రం గొంతు పెగల్చరు. దానికో ఉదాహరణ చూద్దాం. ప్రభుత్వ అధికారిక లెక్కల ప్రకారం వివిధ తెలంగాణ జిల్లాల్లో సాగుబడిలో ఉన్న భూమి విస్తీర్ణాలు ఇలా ఉన్నాయి.

వరంగల్ – 7,46,242 ఎకరాలు

కరీంనగర్ – 6,47,402 ఎకరాలు

నల్గొండ – 4,79,328 ఎకరాలు

నిజామాబాద్ – 4,15,869 ఎకరాలు

మహబూబ్‌నగర్ – 4,02,773 ఎకరాలు

ఖమ్మం – 3,83,005 ఎకరాలు

ఆదిలాబాద్ – 1,84,336 ఎకరాలు

మిగిలిన మూడు తెలంగాణ జిల్లాలు – హైదరాబాద్, మెదక్, రంగారెడ్డి – ప్రధానంగా పారిశ్రామిక ప్రాంతాలు కాబట్టి ఇక్కడి వ్యవసాయ భూమి తక్కువ.

మరో పక్క 7,26,090 ఎకరాల సాగుభూమితో కృష్ణా జిల్లా, మరియు 6,78,197 ఎకరాల సాగుభూమితో గుంటూరు జిల్లా రెండూ వరంగల్ కన్నా వెనకబడి ఉన్నాయి! ఆంధ్రప్రదేశ్ ఏర్పడక ముందు తెలంగాణ ప్రాంతంలో సాగులో ఉన్న ఎకరాలెన్ని, ప్రస్తుతం సాగులో ఉన్నవెన్ని? ఒకప్పుడు 'రైస్ బౌల్ ఆఫ్ సౌత్ ఇండియా'గా పేరొందిన కోస్తా జిల్లాలు ఇప్పుడు వరి సాగుబడిలో తెలంగాణ జిల్లాలకన్నా వెనకబడిపోవటం దేనికి సూచిక? సరే, కాసేపు వరిని వదిలేసి కొన్ని వ్యాపార పంటల సంగతి చూద్దాం:

పత్తిపంట విస్తీర్ణం - తెలంగాణ 70.31%, కోస్తా + సీమ 29.69%

పసుపు పంట విస్తీర్ణం - తెలంగాణ 81.66%, కోస్తా + సీమ 18.34%

మిరప పంట విస్తీర్ణం - తెలంగాణ 52.56%, కోస్తా + సీమ 47.44%

అల్లం పంట విస్తీర్ణం - తెలంగాణ 95.37%, కోస్తా + సీమ 4.63%

పొగాకు పంట విస్తీర్ణం - తెలంగాణ 15.28%, కోస్తా + సీమ 84.72%

ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ భౌగోళిక వైశాల్యం 40% ఐతే కోస్తా, సీమలు కలిపి 60%. పై పంటలు సాగుచేసే విస్తీర్ణాల శాతం గమనించండి. ఒక్క పొగాకులో తప్ప మిగతా వాణిజ్య పంటల్లో తెలంగాణ సాగుభూమి విస్తీర్ణం శాతం అక్కడి భౌగోళిక విస్తీర్ణం శాతానికి సరిగా వ్యతిరేకంగా ఉంది.

ఆదాయ వ్యయాల చర్చలో సాగుభూమి విస్తీర్ణాల పిడకల వేట ఏమిటనుకుంటున్నారా? అక్కడికే వస్తున్నా. యాభై శాతం పైగా బోరు బావుల మీద ఆధారపడి సేద్యం చేసే జిల్లాలు తెలంగాణలో ఎనిమిది ఉండగా, రాయల సీమలో నాలుగు, కోస్తాలో ఒకటి ఉన్నాయి. కోస్తాలో అధిక శాతం సాగుబడి పంట కాలువల కిందే సాగుతుందనీ, ఆ తరహా సేద్యానికి ఏడాదికి ఒక పంట మించి వేసే వెసులుబాటు (ముఖ్యంగా పై రాష్ట్రాలు నీళ్లు బిగబడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో) లేదనీ తెలిసిందే. అదే సమయంలో, బోరు బావుల నీటితో సేద్యం చేసే వారు ఏడాదికి రెండు పంటలు పండించటం కద్దు. దానికయ్యే కరెంటు ఖర్చుని ప్రభుత్వం సబ్సిడీలు, ఉచిత వరాల రూపంలో భరిస్తుంది. దీని లబ్దిదారులు తెలంగాణలోనే అధికంగా ఉండటం గమనించాల్సిన విషయం. మరి ఆ సబ్సిడీ సొమ్ము రాష్ట్ర ప్రజలందరూ కట్టిన పన్నుల ద్వారా సమకూరిందా, లేక ఒక్క తెలంగాణ ఆదాయం నుండే సమకూరిందా? మా సొమ్ము మరెక్కడో ఖర్చు పెట్టటమేంటని కోస్తా/ సీమల్లో ఎవరూ పాంప్లెట్లు పంచటం లేదేం?

**నాలుగో అబద్ధం:**

మీ ఫలానా పేరు, మా ఫలానా పేరు

**ఇదీ నిజం:**

రాజకీయం అంటే జనవాదం అనేది పాచిపట్టిన పాత మాట. అరవైల్లోనే అది భజనవాదంగా మారిపోయింది, తొంభైల్లోకొచ్చేసరికి విభజనవాదంగా పరిణమించింది. స్వకార్యాలు చక్కబెట్టుకోటానికి ఉన్న సమస్యలు ఎక్కువ చేసి చూపటం, లేని సమస్యలు సృష్టించటం, తద్వారా ప్రజల మధ్య చిచ్చు పెట్టటం, ఒకరి మీద ఒకరిని రెచ్చగొట్టటం నేటి తరం నాయకగణం గుణం. అలా రెచ్చగొట్టే కళలో ఆరితేరిపోయినవాళ్లే తెలంగాణ వేర్పాటువాద ఉద్యమ సారధులు. వీళ్లకీ, వీళ్ల అనుయాయులకీ ఓ ఉమ్మడి లక్షణం ఉంది. తమ వేర్పాటు కోరిక్కి వెనకబాటుదనం కారణం అంటూ వాదన మొదలెడతారా, నాలాంటి వాడెవడో వచ్చి 'ఎక్కడ లేదు వెనకబాటుదనం' అని ఎదురు ప్రశ్నిస్తే వెంటనే ఫ్లేటు ఫిరాయించేసి ఆంధ్రావాళ్ల దోపిడీ కారణం అంటారు. అందులో నిజానిజాలేంటో నిగ్గుదేల్చబోతే అక్కడ్నుండి తెలివిగా మరోదాంట్లోకి చర్చని దారి మళ్లిస్తారు. ఒపిగ్గా ఒక్కో ఆరోపణ అంతుచూడటం మొదలు పెడితే 'అసలిదంతా ఎందుకు .. మీరు వేరు, మేం వేరు ఫో' అనేస్తారు.

ఏవేవో వేరంటే ఏదోలా అడ్జస్టైపోవచ్చు, కానీ ఏకంగా 'మీ భాష వేరు, మా భాష వేరు' అనటం వేర్పాటువాదుల తాజా పైత్యం. దానికి ప్రతిగా వివరణొకటి ఇవ్వాల్సి రావటం విధి వైపరీత్యం. భాషకీ, యాసకీ, మాండలికానికీ తేడా తెలీని పండితపుత్రులు ఈ మధ్య మెళ్లో మేధావులనే బోర్డొకటి తగిలించేసుకుని పత్రికల్లో పుంఖానుపుంఖాలుగా వ్యాసాలు రాసి పారేస్తున్నారు – 'తెలుగు వేరు, ఆంధ్రం వేరు' అంటూ! ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణవాసులు మాట్లాడేది తెలుగు, తక్కినోళ్లు మాట్లాడేది ఆంధ్రం అని వీళ్ల విచిత్రాచిత్ర విపరీతవాదం. ఒకే భాషకి రెండు పేర్లున్నంత మాత్రాన అవి రెండు వేర్వేరు భాషలెలా ఐపోతాయన్న ప్రశ్నడిగినోడు వెర్రివాడని వాళ్ల నమ్మకం. అటువంటి వెర్రి మొర్రి ప్రశ్నలకి సమాధానంగా చరిత్రకందని అనాది ఘటనల సంగతులేవేవో మేళవించి ఆదితాళంలో సంగతులేసి మరీ పాడగల ఘనాపాటీలు వాళ్లు. ఆ చెవులతో వింటే ఆంగ్లమూ, ఇంగ్లీషూ సైతం వేర్వేరు భాషల్లా వినిపిస్తాయేమో!

అయితే అసలు సమస్య సదరు పండితపుత్రులతో కాదు – వాళ్ల వితండవాదాన్ని ప్రత్యేకవాద ప్రచారానికో పరమాయుధంగా వాడుకునే పోటుగాళ్లతో. సరే, మాటవరసకి తెలంగాణవారిది తెలుగనీ మిగతావాళ్లది ఆంధ్రమనీ ఒప్పేసుకుందాం. అలా చేస్తే – ఎప్పట్లాగానే ఇక్కడా ఓ తిరకాసెదురౌతుంది. తెలంగాణ భాష తెలుగైనప్పుడు తెలుగు తల్లి వారి తల్లి కాకుండా ఎలా పోయింది? 'తెలంగాణ తల్లి' అంటూ కొత్త తల్లిని సృష్టించుకునే బదులు తెలుగు తల్లిని లాక్కుని 'మీరే ఆంధ్ర తల్లిని పుట్టించుకోండి' అనుండొచ్చుగా? ఎందుకనలేదంటే, ఈయొక్క 'తెలుగు, ఆంధ్రం వేర్వేరు' అనే మహత్తర భాషాస్త్రాన్ని రంగంలోకి దించాలనే అవిడియా తెలంగాణ తల్లిని పుట్టించేనాటికీ దొరలకు తట్టలేదు కాబట్టి, అది తాజాగా వెలిగిన బల్బు కాబట్టి. ఈ మహానుభావులు నిన్నా మొన్నటిదాకా 'తెలుగువారికి రెండు రాష్ట్రాలుంటే తప్పేంటి' అని ఆరున్నొక్క రాగం తీసినోళ్లు. ఇప్పుడు కొత్తగా 'తెలుగు, ఆంధ్రం వేర్వేరు కనక మా భాష ప్రాతిపదికన మాకో ప్రత్యేక రాష్ట్రం ఉండాల్సిందే' అనే పాటందుకున్నారు!

దీన్నిబట్టి అర్థమయ్యేదేంటయ్యా అంటే – తెలుగు, ఆంధ్రం వేర్వేరా ఒకటా అన్నది వీళ్లకనవసరం. 'తెలుగు భాష మాదైతే తెలుగు తల్లి మాది కాకుండా ఎలా పోతుంది' అనే పనికిమాలిన లాజిక్కులకి వారి దగ్గర స్థానం లేదు. తమ లక్ష్యాన్ని కొట్టటానికి ఏ రాయి దొరికితే దాన్ని విసరటమే వీళ్లకి ముఖ్యం. ఊరూవాడా పాంప్లెట్లూ, పోస్టర్లూ వేసి మరీ ఈ తరహా ప్రచారం ఊదరగొడితే జరిగేదేంటి? 'నిజమేనుస్మీ, ఆంధ్రావాళ్లు వేరు తెలంగాణ వాళ్లు వేరు' అనే భావన జనాల్లో నరనరానా జీర్ణమవటం మొదలవుతుంది. వేర్పాటువాదుల ఎత్తుగడ అదే. 'వాళ్లు వేరు, మనం వేరు' అనే అభిప్రాయం తెలంగాణ ప్రజల్లో కలిగించటం, దాని వల్ల వాళ్లలో తలెత్తే అభద్రతాభావాన్ని, పరాయివారిపై మానవసహజంగా కలిగే అపనమ్మకాన్ని తమ పనులు చక్కబెట్టుకోటానికి వాడుకోటం. ఆ వ్యూహం ఫలిస్తుందనేదానికి సూచనే తెలంగాణ ప్రాంతంలో కోస్తాజిల్లాల రిజిస్ట్రేషన్లున్న వాహనాలు ధ్వంసం చెయ్యటం, ఆంధ్రాబ్యాంకు వంటి పేర్లని మార్చటం వగైరా విపరీత చర్యలు. తెలంగాణని వందలేళ్లు దాస్యంలో మగ్గబెట్టిన నిజాముల పేర్లతో హైదరాబాదులో కొలువైన భవనాలూ, సంస్థలూ లెక్కలేనన్ని. 'ఆంధ్రా' పేరు మీద దాడులు చేసే మొనగాళ్ల ఆత్మగౌరవ నినాదంలో నిజాయితీ ఉంటే ముందు ఉస్మానియా యూనివర్సిటీ, నిమ్స్, సాలార్‌జంగ్ మ్యూజియం ఇత్యాది పేర్లు మార్చరేం?

సంస్కృతి విషయంలోనూ అదే రకం మోసపూరిత విష ప్రచారం. తెలంగాణ సంస్కృతి వేరు, తతిమ్మా తెలుగువారి సంస్కృతి వేరట. ఇది పూర్తిగా అబద్ధం కాదనుకోండి, అయితే పూర్తిగా నిజమూ కాదు. రాష్ట్రంలో తెలంగాణ సంస్కృతి, నాన్-తెలంగాణ సంస్కృతి అంటూ రెండే రకాలున్నట్లు మాట్లాడటం ఆ అబద్ధం. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతిరూపమైన భారతదేశంలో ఈ సంస్కృతి అనబడేది వంద మైళ్లకో విధంగా మారిపోయే పదార్ధం – ఇరుగు పొరుగు సంస్కృతుల్లో తేడాల శాతమెంతనేది వేరే విషయం. ఒక ఊరిలోనే కులానికో కట్టుబాటు, మతానికో కట్టూబొట్టూ. ఒక కులంలోనే కోస్తాలో ఓ రకం ఆచారాలు, సీమలో మరో రకం ఆచారాలు, తెలంగాణలో ఇంకో రకం అలవాట్లు. కోస్తాలోనే ఒక్కో జిల్లాలో ఒక్కో రకం ఆహారపుటలవాట్లు – ఓ జిల్లా వారు స్వీట్లు చూసి లొట్టలేస్తే, ఆ పొరుగు జిల్లావారికి పచ్చడి లేనిదే ముద్ద దిగదు. ఒకే జిల్లాలో ఓ ప్రాంతంవాళ్లు గొడ్డు కారాన్నైనా అరాయించుకుంటారు, మరో ప్రాంతంవాళ్లు ఆ ఘాటుకి గుడ్లు తేలేస్తారు. శుభకార్యాల్లో మాంసాహార విందులు నిషిద్ధమైన ప్రాంతాలు కొన్ని, దానికి విరుద్ధమైన ప్రాంతాలింకొన్ని. ఓ ప్రాంతంలో పేరున్న దేవుడు మరో ప్రాంతంలో అనామకుడు. ఒక చోట చేసే పండగలూ, జాతరలూ ఇంకో చోట చెయ్యరు. చెప్పుకుంటూ పోతే ఇలాంటి చిన్నా పెద్దా తేడాలు లెక్కకందవు. వేషాలు, యాసలు, సంప్రదాయాలు, ఆచారాలు, అన్నం తినే అలవాట్ల ప్రాతిపదికన రాష్ట్రాలేర్పాటు చేస్తూ పోతే దేశాన్ని ఎన్ని వేల రాష్ట్రాలుగా విడగొట్టాలి?

**ఐదో అబద్ధం:**

తెలంగాణవారిపై ఆంధ్రావారి వివక్ష

**ఇదీ నిజం:**

రెండో ప్రపంచ యుద్ధంలో అణుబాంబుల ధాటికి కుదేలైన బుల్లి దేశం అనతి కాలంలోనే అగ్రగామిగా మారిన వైనం మన కళ్లెదురే ఉంది. అదే సమయంలో స్వతంత్రం పొందిన మన దేశం ఎక్కడుంది? అమెరికా వాడు బాంబులేశాడని ఏడుస్తూ కూర్చోకుండా రెట్టించిన కసితో జపనీయులు ముందుకు దూసుకుపోతే, బ్రిటిషర్లూ మహమ్మదీయులూ కొల్లగొట్టిన సంపదల ఊసులాడుకుంటూ, తాతలు తాగిన సువాసనాభరిత నేతుల నొల్లు కబుర్లు చెప్పుకుంటూ భారతీయులం మాత్రం గొంగళి వేసిన చోటే ఆర్చుక్కూర్చునున్నాం. ఎందుకంటే - సెల్ఫ్ పిటీలో మన తలదన్నేవారు ప్రపంచంలోనే లేరు కాబట్టి. ఎదుటివాళ్ల సానుభూతి కోసం మనం పడని పాట్లుండవు. 'చూశారా నాకేమయిందో, చూశారా నాకెంత అన్యాయం జరిగిందో' అని గుండెలు బాదుకోటంలో ఉండే మజా సగటు భారతీయుడికి మరి దేనిలోనూ ఉండదు. 'నేను కష్టపడి పైకొచ్చా' అని రొమ్ము విరుచుకుని చెప్పుకోటంకన్నా 'నన్ను వాడు తొక్కేశాడు' అని గుడ్ల నీరు కుక్కుకోటమే ఎక్కువమందికి ప్రీతిపాత్రం. ఆ రకంగా రాలిపడే కడవలకొద్దీ జాలిని కరువుదీరా గ్రోలి బ్రేవుమని తేన్చితే అదో తృప్తి. దాని ముందు మిగిలిన ఇహ పర భోగాలన్నీ బలాదూర్.

అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శనిలా .. అన్ని రకాల వనరులూ, లెక్కలేనంత యువశక్తీ ఉన్నా మన దేశం కునారిల్లుతుండటానికి ఓ ముఖ్య కారణం – భావోద్వేగాలకిచ్చే విలువ మరి దేనికీ ఇవ్వని గుణం తరతరాలుగా మన జాతి జన్యువుల్లో జీర్ణించుకుపోవటం. ఈ గుణానికో కవల సోదరీ ఉంది: మన చేతగానితనానికి ఎవడిమీదనో పడి ఏడవటం. మన సినిమా కథల్లో నూటికి తొంభై సెంటిమెంటు చుట్టూనే తిరుగుతున్నా, వందలాది టీవీ ఛానళ్లలో లెక్కలేనన్ని గ్లిజరిన్ కన్నీళ్ల జీడిపాకం సీరియళ్లు నిరంతరాయంగా ప్రసారమౌతున్నా, పత్రికల్లో ఆదివారం అనుబంధాల కథలన్నీ ఏడుపుగొట్టు బాధా గాధలతోనే నిండిపోయినా, ఎన్నికల్లో ఓడిపోయిన లీడరుడు ఈవీఎంల మీద పడేడ్చినా, పరీక్ష తప్పిన పిల్లాడు పేపర్ ఔటాఫ్ సిలబస్ వచ్చిందనే పాట పాడినా .. వాటన్నిటికీ ఈ జంట గుణాలే కారణం. స్వలాభం కోసం ప్రజల మధ్య చిచ్చు పెట్టబూనే రాబందుగాళ్ళ, వాళ్ల వెనకుండే చిల్లరమల్లర బాజా భజంత్రీగాళ్ల చేతుల్లో ఇవే అల్లావుద్దీన్ అద్భుత దీపాలు. ఉద్యమాల ముసుగులో ఉపాధి కల్పన చేసుకునే రాజకీయ నిరుద్యోగులకి ఇవే ఉద్దీపకాలు.

నాకో స్నేహితుడున్నాడు. కరీంనగర్ వాస్తవ్యుడు, విద్యాధికుడు. మా పరిచయం పన్నెండేళ్ల క్రితం – హైదరాబాదులో ఉద్యోగాల వేటాడే రోజుల్లో. కొన్నాళ్ల వెదుకులాట తర్వాత, ఇద్దరికీ ఒకే సంస్థలో ఉద్యోగమొచ్చింది. ఆ సంస్థ అధిపతి కోస్తాంధ్రవాసి. కొన్నాళ్ల ట్రైనింగ్ తర్వాత ఆ సంస్థ మా ఇద్దర్నీ, మరి కొందర్నీ అమెరికా పంపింది. ఇక్కడికొచ్చాక కొన్నాళ్లకే నా మిత్రుడి ఉద్యోగం ఊడింది. తర్వాత రమారమి ఆరు నెలలు అతను ఖాళీగానే ఉండాల్సొచ్చింది. అతను డీలాపడి ఉన్న సమయంలో, అదృష్టవశాత్తూ నేను పని చేస్తున్న చోట ఓ ఉద్యోగావకాశం రావటం, నేను ఇతన్ని రికమెండ్ చేసి ఆ స్థానంలో తీసుకునేలా చేయటం, అతనా ఉద్యోగంలో చేరి అంచెలంచెలుగా పైకెదగటం జరిగిపోయాయి.

హైదరాబాదులో స్నేహం కుదిరిన నాడూ, అతనికి ఉద్యోగం విషయంలో సహాయం చేసిన నాడూ ఆంధ్రప్రదేశ్‌లో మా ప్రాంతాలు వేర్వేరనే ఆలోచన మా ఇద్దరికీ లేదు. మా కెరీర్లకి పునాదులేసిన సంస్థకీ ఆ తేడా తెలీదు. తెలంగాణ వేర్పాటోద్యమం గీసిన విభజన రేఖల పుణ్యాన, నా స్నేహితుడికి ఈ మధ్యనే తెలిసిందా తేడా. నెలన్నర కిందట, ఓ ఫంక్షన్ సందర్భంగా అతను నాతో అన్న మాట నాకు షాక్ తినిపించింది: 'మీకు మేమంటే వివక్ష భై'.

తేరుకుని కాసేపాలోచించాక అనిపించింది - అతని విషయంలో నేను వివక్ష చూపటం నిజమే. ఉద్యోగార్ధులైన పరభాషా స్నేహితులు మరికొందరూ ఉన్నా ఆనాడు ఇతనికే సహాయం చెయ్యటానిక్కారణం – నా దృష్టిలో సాటి తెలుగువాడన్న ఆపేక్ష, ఆ పరభాషా మిత్రుల దృష్టిలో తమపై వివక్ష. చూసే కోణం నుండే ఉంటుంది ఏదైనా. వివక్ష అనేమాట ఇతన్నుండి రావటమే విచిత్రం. నేనతనికి సాయం చేసినట్లే, అతనూ గత పదేళ్లలో కొందరు స్నేహితులకి సాయం చేసి ఉన్నాడు. వాళ్లందరూ తెలంగాణవాసులే కావటం నాకు తెలిసినంతవరకూ కాకతాళీయం. అనాలంటే దీన్నీ వివక్షే అనొచ్చు మరి. ఆ సంగతటుంచితే, నా స్నేహితుడికి తన ప్రాంతంపై మమకారముండటం తప్పుపట్టాల్సిన విషయం కాదు. అక్కడుండే సమస్యలపై ఆవేదన వ్యక్తం చెయ్యటమూ అర్ధం చేసుకోవాల్సిన విషయమే. ఆ సమస్యలకి పొరుగు ప్రాంతీయులు కారణమనటమే విడ్డూరం. అతని వితండవాదానికి విసిగిపోయి 'తెలంగాణపై అంత ప్రేమున్నోడివి అమెరికాలో ఏం చేస్తున్నావు గురూ' అంటే అతన్నుండొచ్చిన సమాధానం: 'మీ ఆంధ్రావాళ్లు మా హైదరాబాదుపై పడి మాకు ఉద్యోగాలు రాకుండా చెయ్యబట్టి'!

వేర్పాటువాదులు వివక్షకి ఉదాహరణగా ప్రముఖంగా ప్రస్తావించే విషయాల్లో ఇదొకటి – తెలంగాణలో (అంటే హైదరాబాదులో) ఉద్యోగాలన్నీ ఆంధ్రావారే కొట్టేస్తున్నారనే వాదన. అదెంతవరకూ నిజం అనే విషయంలో లెక్కలు రకరకాలుగా వినిపిస్తుంటాయి. ఆ లెక్కలెలా ఉన్నా, ఆ వాదనలో అసలు నిజం లేదనలేం. అయితే దానికి వివక్ష అనే పదం వాడటం సమంజసమేనా? *తమవారికి* సహాయం చేసుకోవటం వ్యక్తులకీ, సమాజాలకీ సహజ లక్షణం. ప్రపంచవ్యాప్తంగా అది సర్వసాధారణం. ఆ గుణానికి పక్షపాతం అన్నది సరైన పదం. వివక్ష అనటం దాన్ని భూతద్దంలో చూపే ప్రయత్నం. మరి ఏది వివక్ష? పొట్టకూటికి రాజధానికి తరలొచ్చినవారిపై దోపిడీదార్లన్న ముద్రేయటం వివక్ష. దారినపోయేవాడిని 'నువ్వు తెలంగాణవాడివా, ఆంధ్రావాడివా' అన్న ప్రశ్నేయటం వివక్ష. ప్రాంతాల పేరుతో 'భాగో, జాగో' నినాదాలివ్వటం వివక్ష. 'నరుకుతాం, నాలుకలు తెగ్గోస్తాం' అనటం వివక్ష. ఇవన్నీ చేస్తుందెవరు?

పైన చెప్పుకున్న పక్షపాతం న్యాయమేనా అన్నది మంచి ప్రశ్న. దాన్ని నియంత్రించాలనే విషయంలో రెండో మాట లేదు. అయితే ఎన్ని ప్రయత్నాలు చేసినా ఏదో ఓ రూపంలో అది బయటపడుతూనే ఉంటుందనేది సత్యం. కారణం – ముందే చెప్పుకున్నట్లు అది మానవులకి సహజ గుణం. తెలంగాణవారు సైతం దీనికి అతీతులేమీ కారు. చారిత్రక కారణాలతో చదువుల్లోనూ, ఉద్యోగాల్లోనూ మొదట్నుండీ కొన్ని కోస్తా జిల్లాలవారు ముందుండటం కాదనలేని నిజం. అయితే గత యాభయ్యేళ్లలో ఈ విషయంలో వీరికీ, ఆంధ్రప్రదేశ్‌లో మిగిలిన ప్రాంతాలవారికీ మధ్య ఉన్న తేడా గణనీయంగా తగ్గుతుందనేదీ నిజం. ముందుగా పరుగు మొదలెట్టిన వాడు అగ్ర స్థానంలో ఉంటాడన్నదీ, ఆలస్యంగా పందెంలో చేరినవాడు అతన్నందుకోటానికి చెమటోడ్చాలనేదీ అర్ధం చేసుకోలేనంత పెద్ద విషయం కాదు. అదే విషయం తెలంగాణ ప్రజలకి విడమర్చాల్సిన రాజకీయ నాయకత్వం ఆ పనిలో ఘోరంగా విఫలమవటమే కాక, తమ చేతగానిదనాన్ని కప్పిపుచ్చుకోటానికి ప్రయోగించిన అబద్ధమే ఈ వివక్ష.

ఈ నిఖార్సైన అబద్ధాన్ని వీళ్లింత నిస్సిగ్గుగా ప్రచారం చేస్తున్నారంటే – ఈ మధ్యనో విదుషీమణి, మనుగడ కోసం పూటకో పార్టీ మార్చే మాజీ మహానటీమణి, తెలంగాణ అమ్మాయిననవటంతో చిత్రసీమలో తనని తొక్కేశారని తాజాగా వాపోయింది! రమారమి పాతికేళ్ల పాటు హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగి, వందలాది సినిమాల్లో నటించి, ఓ దశలో 'లేడీ హీరో'గా పేరొందిన ఈ సుందరికి వయసు పైబడి అవకాశాలు సన్నగిల్లాక ఉన్నట్టుండి తాను తెలంగాణ పోరినన్న విషయం ఎరుకలోకి రావటమే వింతయితే, ఆ కారణంగా తనని సినీ రంగంలో అణగదొక్కేశారన్న దారుణాతిదారుణ నిజం ఈ రోజే సమజవటం అంతకు మించిన వింత. వేర్పాటువాదుల నాలుకల మీద నాట్యమాడే ఇలాంటి అబద్ధాలు కోకొల్లలు. ప్రత్యేకవాదం ఈ అవకాశవాదులకో తురుపుముక్క. విద్యాధికుడు, యుక్తాయుక్త విచక్షణున్నవాడు, ప్రపంచాన్ని చూసినవాడు అనుకున్న నా స్నేహితుడే ఈ మాయగాళ్ల బుట్టలో అంత తేలిగ్గా పడిపోతే ఇతరుల మాటేమిటి? (ఆ ప్రశ్నే ఈ టపాల పరంపరకి ప్రేరణ)

'ఉద్యోగాలు, అవకాశాల సంగతొదిలెయ్. మా యాసపై మీ చులకన భావం సంగతేంటి?' అనే ప్రశ్నేస్తారు వేర్పాటువాదులు. సినిమాల్లో రౌడీలుగా తెలంగాణవారినే చూపుతారన్నది దానికి మద్దతుగా వారు చూపే సిల్లీ ఉదాహరణ. అవే సినిమాల్లో రాయలసీమ యాస మాట్లాడే ఫ్యాక్షనిస్టు విలన్లూ, గోదావరి యాస మాట్లాడే కమెడియన్లూ, ఉగ్రవాదులుగా ముస్లిములూ సైతం స్టీరియోటైప్ చెయ్యబడ్డారనేది వీరు ఉద్దేశపూర్వకంగానే మర్చిపోతారు. సినిమాల్లో ఏదో చూపారని వేర్పడిపోతాం అంటే, మరి తమిళుల్ని హిందీ సినిమాల్లో ఏడిపించే మాటేమిటి? ఆ వంకతో వాళ్లూ దేశం నుండి విడిపోతామంటే? ఒకరి యాసని ఒకరు ఆటపట్టించుకోటం ఈ రోజు కొత్తగా పుట్టుకొచ్చిందేం కాదు, అది రాష్ట్రంలో ఏ ఒక్క ప్రాంతం వారికో ప్రత్యేకమైన అలవాటూ కాదు. ఏం, సర్దార్జీ జోకులు చెప్పి, వినీ పడి పడి నవ్వే తెలంగాణవాసులు ఎందర్లేరు? ఆ మాత్రానికి వాళ్లకి పంజాబీలంటే చులకనో, చిన్నచూపో అందామా?

'తెలంగాణలో ఆంధ్రా భోజన హొటళ్లున్నాయి కానీ, ఆంధ్రాలో తెలంగాణ హొటళ్లు లేవేం' అనేది మరో విచిత్రమైన వివక్షాభియోగం. 'ఆంధ్రాలో ఉడుపి హొటళ్లున్నాయి కానీ ఉడుపిలో ఆంధ్రా హొటళ్లు లేవేం', 'తెలుగువారి సంగీతాన్ని కర్నాటక సంగీతం అనెందుకనాలి', 'హైదరాబాద్‌లో ఇరానీ చాయ్ పాపులర్ కానీ ఇరాన్‌లో హైదరాబాదీ బిర్యానీ పాపులర్ కాదేం' .. ఇవన్నీ చొప్పదంటు ప్రశ్నలు. ఇలాంటి వెర్రి మొర్రి ప్రశ్నలతో జనాల్లో భావోద్వేగాలు రగిలించి లేని సమస్యలు పుట్టించే విద్యలో మన నాయకులు పండిపోయారంటే దానిక్కారణం – మొదటి రెండు పేరాల్లో వివరంగా చెప్పుకున్నాం.

ఇవన్నీ వివక్షలు కావు. అసలు వివక్షలు వేరే ఉన్నాయి. దేశమంతా ఉన్నాయవి – తెలంగాణతో సహా. తరతరాలుగా మన జాతిని పట్టి పీడిస్తున్న చీడ – అంటరానితనం. అరవై మూడు పంద్రాగస్టులు వచ్చి పోయినా దాని అంతు చూడలేకపోయాం. అదే కాదు .. నిమ్న కులాలపై అగ్ర కులస్థుల పెత్తనం, పేదవారిపై ధనికుల దాష్టీకం, ఆడవారిపై మగవారి దారుణాలు, వితంతువులన్న కారణంతో ఈసడించటాలు, వెట్టిచాకిరి .. ఇవన్నీ లేనిదెక్కడ? ఆంధ్రావాళ్లో, మరొకళ్లో తెలంగాణవారిపై వివక్ష ప్రదర్శిస్తున్నారని గగ్గోలు పెట్టే పెద్దమనుషుల్లారా – తెలంగాణలో కొలువైన మాలపల్లెల మాటేమిటి? ముందు వాటిని రూపుమాపి ఆ తర్వాత వేరేవాళ్ల వివక్ష గురించి మాట్లాడండి. వింటున్నారా?

**ఆరో అబద్ధం:**

నల్లగొండ జిల్లాలో ఫ్లోరోసిస్ సమస్య

**ఇదీ నిజం:**

భోపాల్‌లో యూనియన్ కార్బైడ్ దుర్ఘటన జరిగి పాతికేళ్లు దాటిపోయింది. అందులో మృతి చెందినవారి సంఖ్య దాదాపు పాతిక వేలు. ఆ విషవాయువుల ధాటికి వివిధ జన్యు సంబంధిత రోగాల బారిన పడ్డవారి సంఖ్య రమారమి ఐదు లక్షలు! అంత దారుణ దుర్ఘటన జరిగి ఒక తరం గడిచిపోయినా, ఆ బాధితులకి ఇప్పటికీ న్యాయం జరగలేదు. కారణం? మన దేశంలో చట్టాలు చట్టుబండలయ్యాయి కాబట్టి, ప్రభుత్వాలు అంత పసందుగా పని చేస్తాయి కాబట్టి. మన వ్యవస్థ కుళ్లిపోయింది. దానితో పాటే అది పుట్టించే నాయకులూనూ. అలాంటి వారికి సమస్యల నిజ పరిష్కారాలు వెదకటం కన్నా, వాటిని పెంచి పోషించటం, పనిలో పనిగా కొత్త సమస్యలు పుట్టించటం, తర్వాత తీరుబడిగా వాటిని తమ స్వలాభాలకి వాడుకోవటం ముఖ్యం. శవాల మీద చిల్లరేరుకునే రాజకీయవేత్తలు మనకి కొత్త కాదు. వాళ్లకి మేధావిగణాలు సైతం వంత పాడటం మన రాష్ట్రంలో మొదలైన వింత.

తాగు నీటిలో ఫ్లోరిన్ ప్రమాదకరమైన మోతాదులో (1.5 mg/l కన్నా ఎక్కువ) ఉంటే వచ్చే జబ్బు ఫ్లోరోసిస్. పంటి జబ్బుల నుండి ఎముకలు క్షీణించటం దాకా పలు రకాల వ్యాధులు దీనివల్ల వచ్చే అవకాశం ఉంది. ఇవన్నీ నివారించాల్సినవే కానీ, నయం చెయ్యలేని జబ్బులు. పారిశ్రామిక వ్యర్ధాలు భూగర్భ జలాలనీ, నదీ జలాలనీ కలుషితం చెయ్యటం నీటిలో ఫ్లోరిన్ శాతం పెరిగిపోవటానికి ప్రధాన కారణం. సాధారణంగా నిరుపేదలే ఫ్లోరోసిస్ బారిన పడటం కద్దు. ఇటువంటి వారి సంఖ్య ఒక్క నల్లగొండ జిల్లాలోనే లక్షల్లో ఉందనేది నివేదికలు నిగ్గుదేల్చిన నిజం. దశాబ్దాలుగా ఆ వ్యాధిగ్రస్తుల వేదన అరణ్య రోదనే ఔతుందన్నదీ నిజం.

ఈ సమస్య వేర్పాటువాదులకి వరంలా సిద్ధించిందన్నది వీటన్నిటినీ మించిన నిఖార్సైన నిజం. నల్లగొండలో ఫ్లోరోసిస్ సమస్య అపరిష్కృతంగా ఉండటం వీళ్ల పంట పండించింది. అసలు సమస్య పరిష్కారం విషయంలో వీళ్లకి చిత్త శుద్ధే ఉంటే, తెలంగాణపై వీళ్లకి నిజమైన ప్రేమే ఉంటే ఆ సమస్య ఇప్పుడింత తీవ్రంగా ఉండేదే కాదు. కానీ సమస్యల్లేకపోతే వీళ్ల పబ్బం గడిచేదెలా? అవలా ఏళ్లూ పూళ్లూ సాగటమే వీళ్లకి ముద్దు. ఎంచక్కా దాన్నీ పక్కోళ్ల మీదకి నెట్టేసి, వివక్షాభియోగాలు సంధించి, తెలంగాణవాసుల్ని రెచ్చగొట్టేసి తమ పన్లు కానిచ్చేసుకోవచ్చు. ఇప్పుడు జరుగుతుందదే.

నల్లగొండలో ఫ్లోరోసిస్‌కీ ఆంధ్రోళ్లే కారణమట! మోకాలికీ బోడిగుండుకీ ముడిపెట్టటం కన్నా విచిత్రమైన విషయమిది. ఇన్నేళ్లలో తెలంగాణకి అసెంబ్లీలోనూ, పార్లమెంటులోనూ ప్రాతినిధ్యమే లేదా? నల్లగొండ ఫ్లోరోసిస్ గురించి కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ పోరాట్టానికి ఆంధ్రా, సీమల ప్రజా ప్రతినిధులే తెలంగాణకి దిక్కయ్యారా? ఇంతమంది మంత్రులు, ముఖ్యమంత్రులు, ఏకంగా ఓ ప్రధానమంత్రి సైతం తెలంగాణ ప్రాంత నుండి వచ్చారు. వాళ్లందరూ ఫ్లోరోసిస్ విషయంలో చేతులు కట్టుక్కూర్చున్నారా? వాళ్లని నిలదీయాల్సిన వేర్పాటువాదులు ఆ తప్పునీ ఆంధ్రోళ్ల మీదకి నెట్టటం – వాళ్ల స్వభావానికి తగ్గట్లే ఉంది. సాక్షాత్తూ వేర్పాటువాదుల్లోనే మంత్రి పదవులు వెలగబెట్టిన మహానుభావులున్నారు. తమ తమ పదవీకాలాల్లో నల్లగొండ ఫ్లోరోసిస్ విషయంలో వాళ్లేం ఉడబొడిచారో అడిగేవారు లేరు, చెప్పేవారూ లేరు.

ఇంతకీ, ఈ ఫ్లోరోసిస్ అనేది నల్లగొండకి మాత్రమే పరిమితమైన సమస్య కాదు. ప్రపంచంలో పాతిక పైగా దేశాల్లో ఉన్న సమస్యిది. మన దేశంలో ఇరవై రాష్ట్రాలు ఫ్లోరోసిస్ బారిన పడ్డాయి. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే, పందొమ్మిది జిల్లాల్లో ఫ్లోరోసిస్ ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. వాటిలో నల్లగొండ ఒకటి. ఫ్లోరోసిస్ కేసుల్లో నల్లగొండకి దీటైనది ప్రకాశం – 'ఆంధ్రోళ్ల' జిల్లా. నిజానికి, ప్రపంచంలో మొట్టమొదటి ఎముకల/నరాల సంబంధిత ఫ్లోరోసిస్ కేసు వెలుగు చూసిందే ప్రకాశం జిల్లాలో - 1937లో. అప్పట్నుండీ ప్రభుత్వాలెన్ని మారినా ఆ సమస్య ఏ ఏటికాయేడు పెరుగుతూ వస్తుందే తప్ప తగ్గింది లేదు. దానిక్కారణం ఓ పక్కనున్న తెలంగాణవాళ్లో, మరో పక్కనున్న రాయలసీమ వాళ్ళో అని ప్రకాశంవాసులు అనలేదే. తెలంగాణ వేర్పాటోద్యమాల పుణ్యాన నల్లగొండ ఫ్లోరోసిస్‌కి దేశవ్యాప్త గుర్తింపొచ్చింది కానీ, ప్రకాశం జిల్లాకి ఆ భాగ్యమూ లేదు. ఆ వారా, నల్లగొండ ఫ్లోరోసిస్ బాధితులకి అంతోయింతో సహాయమన్నా అందింది. ప్రకాశం బాధితుల గోడెవరు వినేది? వాళ్లే కాదు, మిగిలిన జిల్లాల బాధితుల దుర్గతీ అదే. వాటిలో తెలంగాణ జిల్లాలూ ఉన్నాయి. వేర్పాటువాదులకి తక్కిన తెలంగాణ జిల్లాల బాధ పట్టదు. నల్లగొండలో ఫ్లోరోసిస్ కేసులెక్కువ కాబట్టి, వీళ్ల నాటకాలకి అక్కడ రాలే చిల్లర ఎక్కువ కాబట్టి, ఎంతకీ నల్లగొండ ఫ్లోరోసిస్ గురించే గొంతు చించుకుంటారు, ఆ వంకతో ప్రత్యేక రాష్ట్రం కావాలంటారు. రేపు తెలంగాణ ఏర్పడితే అప్పుడు మిగతా జిల్లాల్లో ఫ్లోరోసిస్ సమస్య ముందుకు తెచ్చి మరో రాష్ట్రం కావాలనటానికి ముందస్తు జాగ్రత్తగా అటక మీద దాచుకుంటున్న అస్త్రమన్న మాట.

ఫ్లోరోసిస్ సంగతి పక్కన పెడదాం. మన రాష్ట్రంలో ఆరోగ్య సంబంధిత సమస్యల్లేనిదెక్కడ? మన్యంలో ఏటా విష జ్వరాల బారిన పడి మట్టిలో కలిసిపోయేవాళ్లెందరు? పోషకాహార లోపంతో పుట్టుకలోనే అవకరాల బారినపడే పిల్లల్లేని జిల్లాలు రాష్ట్రంలో ఎన్ని? వీటన్నిటికీ పక్క జిల్లాల మీదనో, ప్రాంతాల మీదనో పడి ఏడవటంలో ఔచిత్యమెంత? అలా ఏడిస్తే బాధితులకి నికరంగా ఒరిగేదేంటి? సమస్యలకి నిజమైన పరిష్కారాలు వెదక్కుండా పిడుక్కీ బిచ్చానికీ ఒకే మంత్రమంటూ ప్రతిదానికీ ప్రత్యేక రాష్ట్రమే పరిష్కారమనే పాట పాడటం ఎవరి ప్రయోజనం కోసం?

ప్రాంతాలకు ప్రాంతాలే దారుణమైన వ్యాధులకి గురౌతున్నా ప్రభుత్వాల్లో చలనం ఉండకపోవటం దేశవ్యాప్తంగా అతి మామూలైన విషయం అనేదానికి భోపాల్ సంఘటన ఓ తిరుగులేని రుజువు. ఆంధ్రప్రదేశ్‌లో నల్లగొండ జిల్లా మాత్రమే రోగాలతో బాధపడుతున్నట్లూ, దానికి కారణం ఆంధ్రా/సీమ వాసులన్నట్లూ చిత్రీకరించటం వేర్పాటువాదుల అతి తెలివికి నిదర్శనం. ఈ అబద్ధాన్ని అత్యంత పకడ్బందీగా ప్రచారం చేసే కుహనా మేధావులు వాళ్లకి తోడవటం తెలుగు జాతి ఖర్మం. అభివృద్ధి, సంస్కృతి, భాష, ఉద్యోగాలు .. కాదేదీ వేర్పాటుకనర్హం. ఆఖరికి జబ్బులు కూడానా!

**ఏడో అబద్ధం:**

పెద్ద మనుషుల ఒప్పందం ఉల్లంఘన

**ఇదీ నిజం:**

చిన్నపిల్లల్లో ఓ చిరాకెత్తించే లక్షణం ఉంటుంది. ఎంతకీ తాము కోరుకుంది చేతికందిందా లేదా అనే తప్ప అవతలివారి సమస్యలు అర్ధం చేసుకునే శక్తి ఆ వయసులో వాళ్లకుండదు. ఉదాహరణకి, పుట్టినరోజుకి ఫలానా బొమ్మ కొనిపెడతా అని మీ బుడ్డోడికి ప్రమాణం చేశారనుకోండి. కానీ మీరెంత ప్రయత్నించినా ఆ బొమ్మ మార్కెట్లో దొరకలేదు. అందుకని అంతకన్నా విలువైనది మరొకటి కొనుక్కెళతారు. తీరా ఏమౌతుంది? మీ బుడ్డోడు ఆ బహుమతి దర్జాగా తీసుకుని దాచుకుంటాడు, ఆనక మీరు మాటిచ్చిన ఆట బొమ్మ తేనేలేదని ఆరున్నొక్క రాగం అందుకుంటాడు. అయితే, చాలా మంది పిల్లల విషయంలో, వాళ్లు పెద్దయ్యే కొద్దీ ఈ గుణం తగ్గిపోతుంది. కొందరిలో మాత్రం వయసుతో పాటే పెరిగి మూర్ఖత్వంగా మేటేస్తుంది. కొండొకచో అది ఏకంగా సంఘాన్నే కాటేస్తుంది.

1956 ఫిబ్రవరిలో కొంతమంది కాంగిరేసు పార్టీ పెద్దలు – వాళ్లలో కొందరు తెలంగాణ ప్రాంతీయులు, మిగిలినోళ్లు తెలంగాణేతరులు – నయా ఢిల్లీ హైదరాబాదు గెస్ట్ హౌస్‌లో గుమికూడి తలుపులు మూసుకుని ఒకళ్లనొకళ్లు కూసుకుని, ఉద్రేకాలు తగ్గాక ఏవో కోతలు కోసుకుని, వాటినో కాగితమ్ముక్క మీద రాసుకుని, ఆర్నెల్లు గడిచాక ఆగస్టులో తీరుబడిగా దాన్ని తీసుకుని లగెత్తుకెళ్లి లోక్‌సభ ముందుంచారు. వాళ్లలో అందరూ ఆచంట మల్లన్నలే కాబట్టి ఆ ఘనత మనకీ తెలిసేలా దానికి 'పెద్దమనుషుల ఒప్పందం' అనే దిట్టమైన పేరుపెట్టారు. అప్పటి హైదరాబాద్ రాష్ట్రం అప్పటి ఆంధ్రరాష్ట్రంతో కలిసి ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పడబోతున్న దరిమిలా, 'ఆంధ్రరాష్ట్రంతో పోలిస్తే వెనకబడి ఉన్న తెలంగాణ ప్రాంతం అభివృద్ధి కోసం విద్య, ఉపాధి, నిధులు వగైరా విషయాల్లో ఆ ప్రాంతానికి కొన్ని ప్రత్యేక మినహాయింపులు, కేటాయింపులు ఇవ్వాలి' అన్నది స్థూలంగా ఆ ఒప్పందం సారాంశం. ఇక్కడ గమనించాల్సిన విషయం ఒకటుంది. 'పెద్ద మనుషుల ఒప్పందం ఆధారంగా హైదరాబాద్ రాష్ట్రం ఆంధ్రరాష్ట్రంతో కలవటానికి ఒప్పుకుంది' అని వేర్పాటువాదులు వల్లెవేస్తారు. అదే సమయంలో, ఆ ఒప్పందానికి ముందే నాటి హైదరాబాద్ స్టేట్ అసెంబ్లీలో అత్యధికులు విశాలాంధ్రకి మద్దతు తెలిపారన్న విషయం దాటేస్తారు. రెండు ప్రాంతాలూ ఏకమవటానికి రంగం సిద్ధమైపోయాకనే ఈ ఒప్పందం చేసుకోవటం జరిగిందన్నది అసలు వాస్తవం. ఏతావాతా, ఈ ఒప్పందం ఉన్నా లేకున్నా ఆంధ్రప్రదేశ్ అవతరించి తీరేదన్నది నిజం. తాయిలాలు చూపి తెలంగాణని కలుపుకున్నారన్నది అబద్ధం.

ఇంతకీ, సదరు పెద్దమనుషుల ఒప్పందంలో అటు తెలంగాణ, ఇటు తెలంగాణేతర ప్రాంత ప్రజలకి భాగస్వామ్యం ఉందా అంటే లేసే లేదన్నది సమాధానం. దేశమ్మొత్తంలోనూ *అంతర్గత ప్రజాస్వామ్యానికి* నేడే కాక నెహ్రూ హయాములోనూ కాంగిరేసే కేరాఫ్ అడ్రస్. ఇద్దరు నాయకులుంటే మూడు ముఠాలు కట్టే చోద్యం ఆ పార్టీలోనే సాధ్యం. అయ్యదు పార్టీలో భిన్నవర్గాల ప్రయోజనాల పరిరక్షణార్ధం చేసుకున్న లాలూచీ ఒప్పందమే ఇది కానీ, ఇందులో విశాలాంధ్ర హితం ఊసు లేదు. అదే ఉంటే (అప్పట్లో) కాంగ్రెస్‌కి దీటుగా బలమున్న కమ్యూనిస్టు పార్టీ అభిప్రాయాలనీ పరిగణనలోకి తీసుకునేవాళ్లే కానీ ఇలా ఏకపక్ష ఒప్పందానికి తెగబడేవాళ్లు కాదు.

'ఏకపక్ష' అనటానికి బలమైన కారణమే ఉంది. అసలు – ఒప్పందం అంటే ఏంటి? రెండు పక్షాలు ఓ చోట కూర్చుని ఇద్దరి ప్రయోజనాలూ కాపాట్టానికి చేసుకునే ఒడంబడిక. ఇచ్చిపుచ్చుకోవటం ఏ ఒప్పందానికైనా మూలసూత్రం. కానీ ఈ పెద్దమనుషుల ఒప్పందం విషయంలో జరిగిందేమిటి? అందులో ఉందంతా 'మీ ఇంటికొస్తే మాకేమిస్తారు, మా ఇంటికొస్తే మీరేం తెస్తారు' తరహా క్లాజులు. ఎంతకీ ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకి ఏం లాభం కలగాలనే లెక్కలే తప్ప, మిగతా ప్రాంతం గురించిన ఊసు లేదు. తెలంగాణ కోసం ప్రత్యేకమైన రీజినల్ స్టాండింగ్ కమిటీ ఏర్పాటు, తెలంగాణ వారి కోసం తెలుగుని పక్కన పెట్టి ఉర్దూకి పెద్ద పీటెయ్యాలి, తెలంగాణవారికి ఇన్ని మంత్రి పదవులివ్వాలి – వాటిలోనూ ఫలానా ఫలానా శాఖలు తప్పకుండా వారికే ఇవ్వాలి, తెలంగాణ స్కూళ్లలో తెలంగాణవాళ్లే చదవాలి, తెలంగాణ ఉద్యోగాల్లో తెలంగాణవాళ్లే ఉండాలి, తెలంగాణ రెవిన్యూ మిగుళ్లు తెలంగాణలోనే ఖర్చు పెట్టాలి, వగైరా, వగైరా. తెలంగాణ వెనకబడి ఉన్న కారణాన, ఆంధ్రా ప్రాంతంతో క్యాచప్ అవ్వాలంటే ఆ ప్రాంతానికి ఆ మాత్రం మినహాయింపు ఇవ్వాలన్నది న్యాయమైన డిమాండే. ఐతే తెలంగాణేతర ప్రాంతాలన్నీ ఏకరీతిన అభివృద్ధి సాధించాయా? వాటిలోనూ వెనకబడ్డ ప్రాంతాల్లేవా? వాటికి ఏ ప్రత్యేక ప్యాకేజీలూ ఎందుకివ్వలేదు? విశాలాంధ్ర హితం కోరుకునేవారు చెయ్యాల్సిన పనేనా అది? భాష ప్రాతిపదికన దేశంలోనే తొట్టతొలి రాష్ట్రాన్ని ఏర్పాటు చెయ్యబూనుకున్నవారు ప్రాంతీయ అడ్డుగోడల్ని ఛేదించలేకపోవటం ఏమిటి? ప్రాంతాలవారీ అభివృద్ధికి రీజినల్ కమిటీలే శరణ్యమైతే అది ఒక్క తెలంగాణకే ఎందుకు వర్తించాలి? తెలంగాణ మిగులు నిధులు తెలంగాణపై ఖర్చు పెట్టి తీరాలన్న నియమం లాంటిది మిగిలిన వెనకబడ్డ ప్రాంతాలకూ ఎందుకు అమలు చెయ్యకూడదు?

మిగులు నిధుల ప్రస్తావనొచ్చింది కాబట్టి పనిలో పనిగా మరో అబద్ధ ప్రచారం పనీ పడదాం. 'ఆంధ్రప్రదేశ్ ఏర్పడేనాటికి హైదరాబాద్ రాష్ట్రం మిగులు బడ్జెట్‌తో ఉండగా ఆంధ్రరాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉంది. తెలంగాణ మిగులు దోచేసుకోవచ్చనే దుర్బుద్ధితోనే విశాలాంధ్ర పాటందుకున్నారు ఆంధ్రా ప్రాంత నాయకులు' – ఇది వేర్పాటువాదులు నిత్యం పఠించే చరిత్ర పాఠం. 1956లో హైదరాబాద్ స్టేట్ అటూ ఇటూగా ఆరు కోట్ల రూపాయల మిగులుతో ఉంది. ఆంధ్రరాష్ట్రం లోటులో ఉంది. అంతవరకూ నిజమే. ఐతే వెనకబడి ఉన్న తెలంగాణ ప్రాంతం మిగులు బడ్జెట్‌తో ఉండటం ఏంటి? అభివృద్ధి కార్యక్రమాలకి ఖర్చు చెయ్యాల్సిన నిధులు సరిగా వాడుకోకుండా మురగబెట్టటం వల్లనే ఆ మిగులొచ్చిందన్నది అసలు సంగతి. కానీ వేర్పాటువాదులు ఆ ముక్క ఒప్పుకోరు. 'తెలంగాణ ప్రాంతం ఆల్రెడీ అభివృద్ధి చెందింది, దానికి సాక్ష్యమే నాటి మిగులు బడ్జెట్' అని వితండవాదాలు చేస్తారు. అది అబద్ధం అని నిరూపించటానికి ఎక్కడెక్కడో వెదకక్కర్లేదు. 'వెనకబడ్డ తెలంగాణ అభివృద్ధి కోసం' అన్న వాక్యమే పెద్దమనుషుల ఒప్పందానికి ప్రాతిపదిక. 'తెలంగాణ మిగులు ఆదాయాన్ని తెలంగాణ అభివృద్ధికే ఉపయోగించాలి' అన్న వాక్యం కూడా ఆ ఒప్పందంలోనే స్పష్టాతిస్పష్టంగా ఉంది. ఇక ఆ మిగులు నిధుల కోసం ఆంధ్రా వాళ్లు అర్రులు చాచే అవకాశం ఏది?

ఇక్కడొస్తుంది – 'పెద్దమనుషుల ఒప్పందం అమలెక్కడయింది?' అన్న ప్రశ్న వేర్పాటువాదుల నుండి. అందులో ప్రస్తావించిన పదవుల పందేరాలు, కమిటీలు, ఇతరేతర రాజకీయ ఉపాధి అవకాశాల గురించి పక్కన పెడదాం – వాటివల్ల ప్రజలకి నికరంగా ఒరిగేదేమీ లేదు కాబట్టి. ఒప్పందం ఉల్లంఘన అన్న నింద ప్రధానంగా రెండు విషయాల గురించి: 1. తెలంగాణ అభివృద్ధికి న్యాయంగా అవసరమైనన్ని నిధులు ఖర్చు పెట్టటం లేదు. 2. ఒప్పందాన్ని ఉల్లంఘించి మరీ తెలంగాణలో ఉపాధి అవకాశాలు తెలంగాణేతరులు తన్నుకు పోతున్నారు. ఈ రెండు కారణాలతోనే 1969లో మొదటి వేర్పాటు ఉద్యమం ప్రారంభమైంది అన్నది తెలంగాణ ప్రాంతీయులకి వేర్పాటువాదులు నూరిపోస్తున్న మరో అబద్ధం.

వాస్తవం ఏమిటంటే, 1956లో చేసుకున్న పెద్ద మనుషుల ఒప్పందంలో కొన్ని క్లాజులకి కాలపరిమితి ఉంది. ముల్కీ నిబంధనలు, ఉర్దూ అమలు వగైరా విషయాల గురించి అందులో రాసుకున్నవి ఐదేళ్ల పాటు అమలు చేసి చూడాలనీ, ఆ తర్వాత అవసరమైతే మరో ఐదేళ్ల వరకూ పొడిగించవచ్చనీ ఒప్పందంలో స్పష్టంగా ఉంది. ఇదొక తాత్కాలిక వెసులుబాటు మాత్రమే అన్న విషయమూ స్పష్టంగానే ఉంది. మొదటి ఐదేళ్లలో ఒప్పందానికి తూట్లు పడిన ఆరోపణలే లేవు – అప్పట్లో. రాజధానిలో ఉపాధి అవకాశాలు వెదుక్కుంటూ మిగతా ప్రాంతాల నుండి వలసలు అధికమయింది ఆ తర్వాత. అది తెలంగాణలో కొందరు నిరుద్యోగుల కడుపు మంటకి కారణమయింది. దాన్ని భూతంగా మార్చటానికి రాజకీయులు ఉండనే ఉన్నారు కాబట్టి 1969 జనవరిలో పుట్టిన కోతిపుండు చూస్తుండగానే బ్రహ్మరాక్షసయింది. ఇంతకీ, నాటి ఉద్యమ నినాదం 'పెద్దమనుషుల ఒప్పందాన్ని కొనసాగించాలి' అన్న డిమాండే తప్ప 'పెద్దమనుషుల ఒప్పందం ఉల్లంఘించబడింది' అన్న నింద కాకపోవటం గుడ్డిలో మెల్ల. ఆమేరా ఆనాటి వేర్పాటువాదుల్లో అంతో ఇంతో నిజాయితీ ఉందనుకోవాలి. నిజానిజాలు ఇలా ఉండగా, ఆ ఒప్పందం ఉల్లంఘనే 1969 నాటి ఉద్యమానికి ప్రేరణ అన్నది నేటి వేర్పాటువాదులు ఓ పద్ధతి ప్రకారం చేసుకొస్తున్న ప్రచారం. ఇక్కడ జరిగిన ఉల్లంఘన ఏదన్నా ఉందా అంటే అది వేర్పాటువాదుల వైపునుండే. తాత్కాలిక ప్రాతిపదికన ఓ ఒప్పందానికి అంగీకరించి తర్వాత దాన్ని ఎల్లకాలమూ అమలు చెయ్యాలని పట్టుబట్టటమే అసలు సిసలు ఉల్లంఘన.

మిగులు నిధుల గురించీ, వాటి ఖర్చు గురించీ పైన మాట్లాడుకున్నాం. 'తెలంగాణ మిగులు ఆదాయాన్ని తెలంగాణ అభివృద్ధికే కేటాయించాలి' అన్న క్లాజుతో పాటు మరోటీ ఉందా ఒప్పందంలో. రాష్ట్ర ఉమ్మడి నిధుల్లో తెలంగాణ ప్రాంతానికి న్యాయంగా వచ్చే వాటాకి ఈ *తెలంగాణ మిగులు నిధులు* అదనం అన్న మాట. అంటే, ఉదాహరణకి, కోస్తాంధ్ర ప్రాంతం నుండి వచ్చిన నిధుల్లో మిగులేదన్నా ఉంటే అందులో తెలంగాణకి వాటా ఉంటుంది; అదే సమయంలో తెలంగాణ మిగులు నిధుల్లో పక్క ప్రాంతాలకి వాటా ఉండదన్న మాట. ఇప్పుడు చెప్పండి – 'తెలంగాణ మిగులు నిధులపై ఆశతోనే ఆంధ్రావాళ్లు విశాలాంధ్ర ఏర్పాటు కోసం అర్రులు చాచారు' అన్న నిందలో నిజమెంతో. నిజానికి ఆ నింద వేస్తే గీస్తే తెలంగాణవారిపై తెలంగాణేతర్లు వెయ్యాలి. కాదా?

అయితే ఈ మిగులు నిధుల్లో తెలంగాణకి న్యాయంగా రావలసిన వాటా రావటం లేదని 1969 ఉద్యమం సందర్భంగా వేర్పాటువాదులు నానా రభస చేశారు. ఆ సంగతేమిటో చూడమంటూ ఆ ఏడాది ఏప్రిల్ మాసంలో కేంద్ర ప్రభుత్వం జస్టిస్ వశిష్ట భార్గవ నేతృత్వంలో ఓ కమిటీ వేసింది. 1956 నవంబర్ 1 నుండి 1968 మార్చ్ 31 వరకూ ఆంధ్రప్రదేశ్‌లో ఏ ప్రాంతం నుండి ఎంత రెవిన్యూ వచ్చింది, అందులో ఏ ప్రాంతానికి ఎంత వాటా దక్కిందీ తేల్చటం ఆ కమిటీ పని. ఆ పన్నెండేళ్లకి సంబంధించిన అన్ని రకాల జమాఖర్చుల వివరాలు సేకరించి, క్రోడీకరించి సదరు కమిటీ నిగ్గుదేల్చిన నిజమేమిటంటే: 'ఆ పుష్కర కాలంలో తెలంగాణ మిగులు ఆదాయంలో అత్యధికం తెలంగాణ అభివృద్ధికే ఖర్చు చెయ్యటం జరిగింది. అందులో వాడకుండా ఉంచిన నిధులు అతి స్వల్పం. అంతే కాక, రాష్ట్ర ఉమ్మడి ఆదాయంలో (అనగా, తెలంగాణేతర ప్రాంతాల నుండి సమకూరిన ఆదాయం) నుండి తెలంగాణ అభివృద్ధి కోసం ఖర్చు చేసిన నిధులు తెలంగాణకి న్యాయంగా రావలసిన వాటా కన్నా ఎక్కువే' (పై పుస్తకం పేజ్ 189 చూడండి).

పరితలారా .. నిధుల్లో తమకు న్యాయంగా దక్కాల్సిన వాటాకన్నా ఎక్కువే దక్కినా ఆ సంగతి వదిలేసి ఉద్యోగాల్లో తమకు దక్కాల్సినవాటిలో కొన్ని దక్కకుండా పోతున్నాయని గొడవ చేసే గుణాన్ని ఏమంటారు? వ్యక్తులైనా, సమాజాలైనా మనుగడ సాగించాలంటే ఇచ్చిపుచ్చుకోవటం అత్యవసరం అని వీళ్లకెవరు నేర్పుతారు?

**ఎనిమిదో అబద్ధం:**

హైదరాబాదు మాది .. మాదే

**ఇదీ నిజం:**

నా పెరట్లో బావి తవ్వాను. నీళ్లు పడితే మంచిదే. ఆ బావీ నాదే, ఆ నీళ్లూ నావే. అదే పెట్రోల్ పడితే? అప్పుడా బావి దేశమ్మొత్తానిదీ. నా ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా అది జాతీయ సంపద. నేను కొనుక్కున్న స్థలంలో ఉన్నంత మాత్రాన అది నా ఒక్కడిదేననే హక్కు నాకెలా లేదో, తమ తాత ముత్తాతలు నివాసమున్నంత మాత్రాన మన దేశ రాజధానినైనా, రాష్ట్ర రాజధానినైనా, ఆ మాటకొస్తే ఏ ఒక్క ఊరినైనా తమది మాత్రమే అనే హక్కు ఎవరికీ లేదు. హైదరాబాదుకైనా, బొంబాయికైనా, బెంగుళూరుకైనా, న్యూఢిల్లీకైనా ఇది నిజం .. ఇదే నిజం.

ప్రత్యేక రాష్ట్రానికి సంబంధించిన ప్రతి చర్చా చివరికొచ్చి పడేది హైదరాబాదు దగ్గరికే. దేశంలో ఇంతకు ముందూ చిన్న రాష్ట్రాలెన్నో ఏర్పడ్డాయి. మరి కొన్నింటి కోసం ఇప్పుడూ ఉద్యమాలు నడుస్తున్నాయి. కానీ వాటిలో ఎక్కడా లేని విశేషం మన దగ్గరుంది. అది – రాష్ట్ర రాజధాని నగరం కొలువై ఉన్న ప్రాంతమే విడిపోతానని గొడవ చెయ్యటం. ఆ మధ్యెవరో పాత్రికేయుడన్నాడు: 'ఇది ప్రత్యేక తెలంగాణ ఉద్యమం కాదు. తెలంగాణవాదులు చేస్తున్న ప్రత్యేకాంధ్ర ఉద్యమం'. ఎంత నిజం! పేరుకి వేర్పాటువాదులు 'మేం విడిపోతాం' అంటున్నా, నిజానికి వాళ్లనేది 'మీరు విడిపోండి' అనే. 'మీ రాజధానిని మీరు వెదుక్కోండి, మీ చావు మీరు చావండి' అనే. అదేమంటే 'ఛాఁ. హైదరాబాదు మాది. మీరెవరు ఇక్కడికి రావటానికి' అనే హుంకరింపులు.

దేశంలో ఏ ప్రధాన నగరాన్ని తీసుకున్నా దాని అభివృద్ధిలో స్థానికులకన్నా స్థానికేతరుల పాత్రే ఎక్కువుందన్నది కాదనలేని సత్యం. తెలుగువారి రాజధాని తెలంగాణవారిది మాత్రమే అని ప్రభుత్వాలూ, పారిశ్రామికులూ మడికట్టుకునో, గిరిగీసుకునో కూర్చుని ఉంటే హైదరాబాదు ఇప్పుడిలా ఉండేదీ కాదు, దాని గురించి ఇంత రచ్చ జరిగేదీ కాదు. ఈ మహానగరం ఆంధ్రప్రదేశ్ రాజధాని హోదాలో స్వదేశీ, విదేశీ వ్యాపారాల్నీ, పరిశ్రమల్నీ, లెక్కలేనన్ని కేంద్ర ప్రభుత్వ సంస్థల్నీ, నిధుల్నీ, విద్యాలయాల్నీ, మరెన్నో సదుపాయాలనీ సముపార్జించుకుందే తప్ప ఒకానొక తెలంగాణ నగరంగా కాదు. 'మనం'గా సమకూర్చుకున్న హంగులవన్నీ. ఇప్పుడవన్నీ 'మావే' అనటం దారుణం. ఏరు దాటాక తెప్ప తగలెయ్యటం నయవంచన. తెప్పతో పాటు దాన్లోని సహ ప్రయాణీకుల్నీ తగలెట్టబూనటం వేర్పాటువాదుల నయావంచన.

'హైదరాబాదు అభివృద్ధిలో మాకు మాత్రం భాగం లేదా' అనడిగితే వచ్చే రొటీన్ రొడ్డకొట్టుడు సమాధానం, 'ఏంటి మీరు చేసిన బోడి అభివృద్ధి. అప్పుడూ ఇప్పుడూ హైదరాబాదు స్థానం ఐదే'. ఈ ఐదో నంబరు ఏమిటో, ఏ విషయంలోనో అడిగేవాడు లేడు, చెప్పేవాడూ లేడు. నాకు తెలిసి – ఒకప్పుడూ, ఇప్పుడూ జనాభా పరంగా హైదరాబాద్ దేశంలో ఆరో పెద్ద నగరం. ఆ నంబరుకీ, అభివృద్ధికీ లంకె పెట్టేవాడు అమాయకుడు. అలాంటోళ్లని పట్టించుకోనవసరం లేదు. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అవతరించాక – ముఖ్యంగా గత ఇరవయ్యేళ్లలో – హైదరాబాదు వృద్ధిపథంలో దూసుకుపోలేదనేవాళ్లు అబద్ధాలకోర్లు ('ఆ వృద్ధి ఫలాలు అందరికీ సమానంగా లభించాయా', 'అభివృద్ధి పేరుతో నగరం కాలుష్య కాసారంగా మారలేదా', వగైరా ఈ చర్చకి సంబంధం లేని ప్రశ్నలు. అవి

హైదరాబాదుకి మాత్రమే కాదు, ప్రపంచంలో ఏ నగరానికైనా వర్తించేవి). ఇలాంటోళ్లు నడిపే ఉద్యమాలు పిచ్చోళ్ల చేతుల్లో రాళ్లు. హైదరాబాదు గురించి వీళ్లో అరిగిపోయిన రికార్డేస్తుంటారు: 'దేశానికి స్వతంత్రం వచ్చేనాటికి హైదరాబాదు రాజ్యం ప్రపంచంలోనే సుసంపన్నమైన దేశం'. వీళ్ల అన్ని మాటల్లా ఇందులోనూ నిజం అరకొరే. అసలు నిజమేమిటంటే, 1948 నాటికి హైదరాబాదు నవాబు ప్రపంచంలో అత్యంత ధనికుల్లో ఒకడు. దానర్ధం హైదరాబాదు రాజ్యంలో ప్రజలంతా భోగభాగ్యాలతో తులతూగేవారని కాదు. అదే నిజమైతే 1956లో 'తెలంగాణ వెనకబాటుదనం' ప్రాతిపదికగా పెద్దమనుషుల ఒప్పందం ఎందుకు? సరే, అది వేరే చర్చ. వదిలేద్దాం. నాటి నవాబుల వైభవానికి నేటి కోస్తా, సీమ జిల్లాలెలా సమిధలయ్యాయో చూద్దాం.

ఒరిస్సాలోని గజపతి, గంజాం జిల్లాలతో కలిపి, శ్రీకాకుళం జిల్లా నుండి ప్రకాశం జిల్లా దాకా విస్తరించిన కోస్తా ప్రాంతం పదిహేనో శతాబ్దంలో బహమనీ సుల్తానుల పాలనలో ఉండేది. చరిత్ర క్రమంలో అది చేతులు మారుతూ పదహారో శతాబ్దం నాటికి (హైదరాబాదు నగర నిర్మాణం మొదలవటానికి ఇరవయ్యొక్కేళ్ల ముందు) గోల్కొండనేలిన కుతుబ్‌షాహీ వంశం అధీనంలోకొచ్చింది. గోల్కొండ సామ్రాజ్యం పదిహేడో శతాబ్దంలో ఔరంగజేబ్ పాలనలోకెళ్లి, అట్నుండి పద్దెనిమిదో శతాబ్దంలో (క్రీ.శ. 1724) మొదటి నిజాం నవాబు అధీనంలోకొచ్చింది. అనంతర కాలంలో నిజాముల రాజకీయ అవసరాల కోసం ఏవేవో ఒప్పందాల పేరుతో పైన చెప్పిన కోస్తా జిల్లాలు మొదటగా ఫ్రెంచి వారికీ, ఆ తర్వాత బ్రిటిష్ వారికీ తాకట్టు పెట్టబడ్డాయి. వాటినే ఉత్తరాది సర్కార్ జిల్లాలన్నారు. ప్రతిఫలంగా ఈ జిల్లాలపై బ్రిటిష్ వారినుండి నిజాం నవాబు ఏటేటా భారీ మొత్తంలో రొక్కం పొందేవాడు. క్రీ.శ. 1788లో సర్కారు జిల్లాలను బ్రిటిష్ వారు పూర్తిగా సొంతం చేసుకునేదాకా ఈ చెల్లింపులు కొనసాగాయి.

మరో పక్క – నాలుగో మైసూరు యుద్ధంలో ఫ్రెంచి వారితో జతగట్టిన టిప్పు సుల్తానుని ఓడించటానికి ఆంగ్లేయులతో చెయ్యి కలిపినందుకు టిప్పు ఓటమి అనంతరం నాటి మైసూరు రాజ్యంలోని దక్కను భాగం నిజాం నవాబుకు ఈనాముగా లభించింది. అందులో చాలా భాగాన్ని తర్వాత కాలంలో నిజాం రెండవ అసఫ్ ఝా ఆంగ్లేయులకు ధారాదత్తం చేశాడు. ఎందుకు? హైదరాబాద్ రాజ్యంపై ఫ్రెంచ్, మరాఠా దాడుల్ని కాచుకోటానికి ఆంగ్లేయుల సైన్య సహకారం అవసరమై, అందు నిమిత్తం ఓ ఒప్పందం కుదుర్చుకోవటం మూలాన. అలా ఇచ్చేసినవే తెలుగులో దత్త మండలాలుగానూ, ఆంగ్లంలో సీడెడ్ డిస్ట్రిక్ట్‌స్‌గానూ పేరొందిన నేటి రాయలసీమ జిల్లాలు. ఇది క్రీ.శ. 1800 నాటి మాట.

అదీ చరిత్ర. అటు సర్కారు జిల్లాలు (కోస్తాంధ్ర), ఇటు సీడెడ్ జిల్లాలు (రాయలసీమ) రెండూ హైదరాబాదు పాలకుల రాజకీయ చదరంగంలో పావులుగా ఉపయోగపడ్డాయి. పై ఒప్పందాలేవీ లేని హైదరాబాదు రాజ్యం భౌగోళిక స్వరూపం మరోలా ఉండేది. దాని చరిత్ర సైతం వేరేలా ఉండేది. ఆ చరిత్రలో తెలంగాణ, కోస్తాంధ్ర, రాయలసీమ అన్న మాటలే ఉండేవి కావు. ఈ ఉద్యమాలూ ఉండేవి కావు. కాబట్టి తెలంగాణ చరిత్ర నుండి కోస్తా, సీమలని విడదీసి చూడటం అసమంజసం. నాటి హైదరాబాదు సౌభాగ్యం కోసం పణంగా పెట్టబడ్డ ఈ రెండు ప్రాంతాలకి హైదరాబాదు నగరంతో ఏ సంబంధమూ లేదనటం అన్యాయం. అందులోనూ కోస్తా ప్రాంతం (సర్కార్ జిల్లాలు) 1788 దాకా ఏదో ఓ రూపంలో గోల్కొండ/హైదరాబాద్ పాలకులకి ఆదాయం తెచ్చిపెడుతూనే ఉంది. ఆ రకంగా – హైదరాబాదు నగరాభివృద్ధిలో తొలి రెండొందలేళ్లలోనూ కోస్తాంధ్ర భాగస్వామ్యం ఉంది.

అంతే కాదు, 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డ దరిమిలా మొదటి ఐదేళ్ల వరకూ (1961 దాకా) రాజధాని నగరానికి అవసరమైన హంగులకయ్యే ఖర్చు మొత్తమూ ఆంధ్ర, సీమ ప్రాంతాల పద్దులోనే వెయ్యబడింది. దానిక్కారణం – అప్పటికే హైదరాబాదులో అందుబాటులో ఉన్న భవనాలు, ఇతర సదుపాయాలన్నీ తెలంగాణ సమకూర్చినట్లు ప్రభుత్వం భావించటం, కొత్తగా అవసరమైన వాటికయ్యే ఖర్చు తెలంగాణేతర ప్రాంతాల ఖాతాలో వెయ్యటమే న్యాయమని అనుకోవటం. 1961 తర్వాత నుండీ ఈ ఖర్చుని కోస్తా/సీమ, తెలంగాణ ప్రాంతాలు 2:1 నిష్పత్తిలో పంచుకోవటం జరుగుతుంది. ఏతావాతా, ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక హైదరాబాద్ అభివృద్ధికి ప్రభుత్వపరంగా చేసిన ఖర్చులో అధిక శాతం తెలంగాణేతర ప్రాంతాలే భరించాయి. అప్పుడు వాళ్లెవరూ నోరెత్తి ఇదేమనలేదు. ఎందుకు? 'హైదరాబాదు మనందరిది' అనుకోబట్టి. ప్రభుత్వపరమైన వృద్ధి సంగతి అటుంచి ప్రైవేటు రంగంకేసి దృష్టి సారించినా, ఈ యాభయ్యేళ్లలోనూ హైదరాబాదు సాధించిన విజయాల్లో తెలంగాణవారి పాత్రంతో తెలంగాణేతరుల పాత్రా అంతే – కొండొకచో అంతకన్నా ఎక్కువే ('తెలంగాణేతరులు' అంటే కేవలం ఇతర తెలుగు ప్రాంతాల వారు కాదు, భారతీయులందరూ). అందుకే హైదరాబాదు జాతీయ సంపద. 'ఇది నాది, నాదే' అనే హక్కు ఏ ఒకరికీ లేదుగాక లేదు.

**తొమ్మిదో అబద్ధం:**

ఆంధ్రోళ్లు దోపిడీదార్లు

**ఇదీ నిజం:**

స్వతంత్రం వచ్చీ రాగానే జాతి సౌభాగ్యం కోసమంటూ పంచవర్ష ప్రణాళికా సంకల్పాలు చెప్పుకున్న దేశం మనది. ఆ జాబితాల్లో రాసుకున్నవీ, రాసుకోనివీ, ఇతరత్రా సవాలక్ష వంటకాలు సక్రమంగా వండబడుతున్నాయో లేదో, వండినవి సరిగా వడ్డించబడుతున్నాయో లేదో చూట్టానికి కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో వేలాదిమంది చట్ట సభల సభ్యుల్ని ఎన్నుకోటానికీ, అలా ఎన్నికైనోళ్లలో పని దొంగల్ని తన్ని తగలెయ్యటానికీ ఐదేళ్లకోమారు భూమ్మీద మరే దేశంలోనూ లేనంత భారీ ఖర్చుతోనూ, శ్రమతోనూ ఎలక్షన్ల మహాయజ్ఞాన్ని తలకెత్తుకుని ఆర్భాటంగా అమలు చేస్తున్న దేశమూ మనదే. ఈ సువిశాల కర్మభూమిలో ఏడాది పొడుగునా ఏదో ఓ మూల చిన్నదో పెద్దదో ఎన్నికల క్రతువొకటి జరుగుతూనే ఉంటుంది. ఈ తంతంతా దేనికి? నాయకులు ఎక్కడికక్కడ తాము ప్రాతినిధ్యం వహించే ప్రజల పక్షాన పోరాట్టానికి. దానికి అవసరమైనదేంటి? జన పక్షపాతం. కానీ మన నాయకుల్లో ఉన్నదల్లా స్వార్ధం, స్వజన పక్షపాతం. లేనేలేనిది జవాబుదారీతనం. మరి మళ్లీ ఎన్నికల్లో నెగ్గుకు రావటమెలా? అదో సమస్యైతే కదా. ఓటర్లని ఎంతగా అజ్ఞానంలో ఉంచితే వాళ్లని అబద్ధాలతో ముంచెత్తటం అంత తేలిక. స్వతంత్రం వచ్చేనాటికి దేశంలో వెనకబడ్డ ప్రాంతాలు ఇప్పటికీ వెనకబడే ఉండటానికి కారణం అదే. తెలంగాణైనా, ఉత్తరాంధ్రైనా, బీహారైనా .. ప్రాంతమేదైనా ప్రజల వెనకబాటుదనమే అడ్డగోలు దోపిడీలకి తెగబడే రాజకీయ నాయకులకి ఐదేళ్లకోసారి శ్రీరామరక్ష, ఓటు భిక్షేసే అక్షయపాత్ర.

వెనకబడి ఉన్నోడికి ముందుకెళ్లినోడిపై కడుపు మండేలా చెయ్యటం, వాడినో దోపిడీదారుడిగా చిత్రీకరించి తమ పబ్బం గడుపుకోవటం నేటి తరం నేతలకి వెన్నతో పెట్టిన విద్య. ఆ విద్యలో రెండాకులు ఎక్కువ చదివినోళ్లు తెలంగాణ వేర్పాటువాద సృష్టికర్తలు, సిద్ధాంతకర్తలు, వాళ్ల తోకలైన మేధావి మూకలు. జనహితం ముసుగులో వీళ్లు రేపెట్టే ఉద్యమాల వెనక ఎవరి జెండాలూ, అజెండాలూ వారికున్నాయి. ప్రజలు తమకప్పగించిన పని సక్రమంగా చెయ్యకుండా – తమ అసమర్ధ నిర్వాకాల నుండీ అవినీతి భాగోతాల నుండీ ఓటర్ల దృష్టి మళ్లించటానికీ, పనిలో పనిగా స్వీయ ప్రయోజనాలని ఓ కాపు కాసుకోటానికీ ఈ నేతల చేత నేయబడి తెలంగాణలో విరివిగా చెలామణిలోకి తేబడ్డ అభియోగమే ఆంధ్రావాళ్లు దోపిడీదారులనే దారుణమైన అబద్ధం. దాన్ని వాళ్లెంత పకడ్బందీగా ప్రచారం చేశారో తెలిస్తే గోబెల్స్ సైతం విస్తుపోవటం ఖాయం.

ఆంధ్రప్రదేశ్‌లో ధనికులెక్కువగా పోగుపడ్డ ప్రాంతమేదంటే ఎవరికన్నా చప్పున గుర్తొచ్చేవి నాలుగైదు కోస్తా జిల్లాలు. అక్కడ సంపన్నులు ఎక్కువుండటానికి సవాలక్ష కారణాలున్నాయి (అలాగని అక్కడున్నోళ్లందర్నీ అదృష్టం దరిద్రంలా పట్టి పీడిస్తుందనుకునేరు .. అక్కడా లెక్కకు మిక్కిలి పేదలున్నారు). ఆ సంపదంతా తమని దోచుకుని సృష్టించుకున్నదేనన్న నింద వేర్పాటువాదులది. అయితే వీళ్లో విషయం తెలివిగా దాటేస్తుంటారు. అదేమిటంటే – 1956కి ముందే, రెండు తెలుగు ప్రాంతాలూ విలీనమవకముందే, సదరు కోస్తాంధ్ర ప్రాంతం తెలంగాణ కన్నా ముందంజలో ఉందనేది (ఆ ముక్క వీళ్ల తురుపుముక్క 'పెద్దమనుషుల ఒప్పందం'లో సైతం స్పష్టాతిస్పష్టంగా ఉంది). అప్పటిదాకా కోస్తాంధ్రులు ఎవర్ని దోచుకుని సంపదలు కూడబెట్టుకున్నారో మరి!

అశ్వత్థామ హత: అంటూ ఎలుగెత్తి చాటి ఆనక కుంజర: అని తనలో తను గొణుక్కున్న అధర్మరాజుకి తీసిపోని తెలివితేటలు వేర్పాటువాదుల సొంతం. ఆంధ్రావాళ్లందరూ దోపిడీదార్లనే అర్ధంలో ఎడాపెడా రెచ్చగొట్టే ప్రసంగాలూ, వ్యాఖ్యలూ చెయ్యటం, అదేమంటే 'అబ్బే .. అది అందరికీ కాదు, కొందరికే వర్తించే విషయం' అంటూ ముక్తాయించటం. ఈ లోగా వాళ్ల సందేశం చేరాల్సిన చోట్లన్నిట్లోకీ నిక్షేపంగా చేరిపోయింది, వాళ్లాశించిన ఫలితాలు సైతం తేవటం మొదలెట్టిందనేదానికి సాక్ష్యాలే – తెలంగాణలో కోస్తా పేర్లని పోలిన ఊళ్ల పేర్లు మార్చేసే విపరీత పోకడలు, రాష్ట్ర రాజధానిలో కోస్తా రిజిస్ట్రేషన్లున్న వాహనాల్ని ధ్వంసం చేసే ఉన్మాద చర్యలు, పండక్కి స్వగ్రామాలకెళ్లినోళ్లని తిరిగి రానీయమనే బెదిరింపు ప్రకటనలు (ఆ తర్వాత ఏవో వెన్నపూసే మాటలన్నారు కూడా కదా అంటూ వెనకేసుకొచ్చేవాళ్ల కోసం: మిమ్మల్నెవరన్నా నాలుగు తన్ని ఆ తర్వాత టించర్ రాసి పంపితే మురిసిపోతారా?). అదిలించో బెదిరించో అదుపులోకి తెచ్చుకున్న మెయిన్‌స్ట్రీమ్ మీడియా అండతో, గజ్జెకట్టి చిందులేసే కుహనా విప్లవకారుల చిడతల చప్పుళ్లతో, కాలం చెల్లి బూజు పట్టిన భావజాల పడికట్టు పదాల గారడీలతో కనికట్టు చేసే కవుల కలాల దన్నుతో, జనమెన్నడో మరిచిపోయిన చిన్నాచితకా రచయితల రాతల ఊతంతో, పల్లె పల్లెలో కరపత్రాలూ, పుస్తకాలూ, వాల్‌పోస్టర్లతో అదే పనిగా ఆంధ్రావాళ్లు దోపిడీదారులని ఊదరగొడుతూ చేసిన అసత్య ప్రచారం – తెలంగాణవ్యాప్తంగా వేర్పాటువాదులు ఏళ్లుగా ఓ పద్ధతి ప్రకారం అమలు చేసిన వ్యూహం. వీళ్లకి తోడుగా, పాఠాలు చెప్పాల్సిన ప్రొఫెసర్లే విద్యార్ధుల్ని పెడతోవ పట్టిస్తూ చాపకింద నీరులా విశ్వవిద్యాలయాల సాక్షిగా సాగించిన అదనపు ప్రచారం – ఈ మధ్యనే వెలుగు చూసిన నిజం.

ఈ బాపతు ప్రొఫెసర్లలో ఆంధ్రావాళ్లంటే అకారణద్వేషం నరనరానా నిండిపోయిన ఒకానొక ప్రబుద్ధుడిని వేర్పాటువాదుల జేఏసీకి పెద్దదిక్కుగా పెట్టుకుంటే ఆ దొర నిన్నో మొన్నో 'ఆంధ్రోళ్ల ఆస్థులెన్నెన్నో లెక్కలు కడతాం, డొక్కలు చీరేస్తాం' అంటూ ఆవులించాడు. ఒక్క ఆంధ్రావాళ్లవే కాకుండా, అయ్యవారు పనిలో పనిగా ప్రాంతాలవారీగా ఎవరెవరు ఎంతెంత కూడేసుకున్నారో కూడా కూపీల్లాగి అశేష ప్రజానీకం ముందర పెడితే వద్దనేదెవరు? ఆ పని చెయ్యటానికి అడ్డొచ్చేదెవరు? తెలంగాణ ప్రాంతంలో (అనగా హైదరాబాదులో) పెట్టుబడులన్నీ ఆంధ్రావారివే ఐనట్లూ, తెలంగాణవారూ, తమిళులూ, మార్వాడీలూ, మరాఠీలూ, బెంగాలీలూ, అంబానీలూ .. మరెవరూ అక్కడ వ్యాపారాలు చేసుకోనట్లూ – చేసుకున్నా వారందరూ నిఖార్సైన నీతిపరులే ఐనట్లూ – ఒక్క ఆంధ్రావారిపైనే ఈ ప్రత్యేక దృష్టేల? వారొక్కరిపైనే దోపిడీదార్లనే ముద్రేల?

తల బద్దలు కొట్టుకోవాల్సినంత బ్రహ్మరహస్యమేమీ దాగిలేదు దాని వెనక. పక్క రాష్ట్రం నుండొచ్చి వ్యాపారాలు చేసుకునేవారిపై దోపిడీదార్లనే ముద్రేసి ఆ వంకతో రాష్ట్రం చీల్చమంటే దేశమంతా నవ్విపోతుంది; పార్లమెంటులో పరాయి రాష్ట్రాల ప్రాంతీయ పార్టీలేవీ సహకరించవు. అదే – తోటి తెలుగువాళ్లపై కల్లబొల్లి మాటలు చెప్పి కళ్లనీళ్లు పెట్టుకుంటే సానుభూతి వెల్లువెత్తుతుంది, పార్లమెంటులో పప్పులుడికుంచుకునే అవకాశమూ అంతో ఇంతో ఉంటుంది. అన్నదమ్ముల్ని విడగొట్టాలంటే వాళ్లిద్దరి మధ్యే కదా చిచ్చు పెట్టాల్సింది – అలా కాకుండా పొరుగింటి పుల్లయ్యతో తంపులు పెడితే జరిగేదేమిటి? అప్పుడు అన్నదమ్ములిద్దరూ ఏకమై పుల్లయ్య పని పడతారు. మరి నేతల పనులయ్యేదెలా? తెలుగు రాష్ట్రాన్ని ముక్కలు చెయ్యాలంటే సాటి తెలుగువారి మీదనే కదా నిందలేయాల్సింది – బయటివారిపై వేస్తే రాష్ట్రమెలా చీలుతుంది? అదీ అసలు సంగతి. అందుకే నదీజలాల నుండి నైజాములో పొలాల దాకా, రాజధానిలో స్థలాల నుండి రాష్ట్ర ప్రభుత్వోద్యోగాల్లో కోటాల దాకా ప్రతి విషయాన్నీ వివాదాస్పదం చెయ్యటం, ప్రతిదానికీ తెలంగాణ వెనకబాటుదనంతో ముడిపెట్టటం, చివరాఖరికి వాటన్నిట్లోనూ ఏకైక లబ్దిదారులుగా ఆంధ్రావారిని తేల్చటం, వాళ్లపై దోపిడిదారులనే

ముద్రేయటం. ఇవన్నీ లొసుగులు లేని విషయాలా అంటే కానే కాదు – మనదేశంలో లొసుగుల్లేకుండా అమలయ్యేదేమున్నది గనక? కానీ వాటన్నిట్లోనూ నాణానికి ఒక వైపే చూపించి తెలంగాణ ప్రజల్ని మభ్యపెట్టటం వేర్పాటువాదుల చాతుర్యం. స్థలాలైనా, జలాలైనా, మరేవైనా .. వాటివల్ల తెలంగాణకి కలిగిన ఉపయోగాలూ ఉన్నాయి. వాటి గురించి మాత్రం నోరెత్తే వేర్పాటువాది ఒక్కడూ ఉండడు.

మొదట్లోనే చెప్పుకున్నాం – చట్టసభల సభ్యుల అవసరమేంటో, వాళ్లకి ఎన్నికల్లో జనాలు ఓట్లేసి గెలిపించిన పరమార్ధమేంటో. పరీక్ష ఫెయిలై ఇంటికొచ్చిన పిల్లాడు మేష్టారు పాఠం సరిగా చెప్పలేదనో, పేపర్ అవుటాఫ్ సిలబస్ ఇచ్చారనో, ఇన్విజిలేటర్ మరీ స్ట్రిక్ట్‌గా ఉన్నాడనో, మరోటనో వంక చెప్పినట్లుంది తెలంగాణ వెనకబాటుదనానికి ఆంధ్రావారిపై వేలెక్కుపెట్టటం. సరే, ఆంధ్రావాళ్లు దోపిడీదార్లనే అనుకుందాం. మరి ఇన్నేళ్లుగా ఈ నేతలంతా మొద్దు నిద్ర పోతున్నారా? అరవయ్యేళ్లుగా తెలంగాణలో ఏ నాయకుడూ ఆంధ్రా దోపిడీదారుల దురాగతాలకు బలై కొంపా గోడూ అమ్ముకున్న దురంతాలో, పిల్లా జెల్లా సమేతంగా వీధిన పడ్డ భాగోతాలో జరిగాయనటానికి దాఖలాల్లేవు. వేర్పాటువాద పల్లవందుకున్న రాజకీయ నాయకులందరి చరిత్రలూ తిరగేస్తే – మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా రక రకాల పదవులు దశాబ్దాలుగా వెలగబెట్టి కోటానుకోట్లు పోగేసుకున్న వాళ్లే అంతా. సొంత లాభాలు చూసుకునేప్పుడు అడ్డు రాని ఆంధ్రా దొంగలు ఓటర్లకి మొహం చూపించాల్సొచ్చినప్పుడు మాత్రం ఆదుకోటానికి ఎక్కడున్నా లగెత్తుకొస్తారు!

అది – అధికారం అనుభవించినన్నాళ్లూ కనుమరుగైన తెలంగాణ నిర్భాగ్యం పదవి ఊడిన క్షణానే కళ్లలో పడ్డ మందుబాబు కావచ్చు, మంది సొమ్ముని విందు భోజనంలా సకుటుంబ సపరివార సమేతంగా భోంచేసి ఆనక తీరిగ్గా సొమ్ములు పోనాయి ఏటి సేద్దామంటూ తేన్చేసినప్పుడు గుర్తులేని ఉత్తరాంధ్ర దౌర్భాగ్యం గురించి తాజాగా జ్ఞానోదయమైన మహానుభావుడు కావచ్చు – ఇంత విచ్చలవిడిగా పచ్చి అబద్ధాలతో ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టబూనే ధైర్యం వీళ్లకెక్కడి నుండొచ్చింది? అంత తెగింపు ఎవరిస్తున్నారు వీళ్లకి?

సమాధానం మనలోనే ఉంది. మన సమాజపు పునాదుల్లోనే ఉంది. ఆడలేక మద్దెల ఓడని పాత తెలుగు సామెత. అటూ ఇటూగా అలాంటివే భారత దేశంలో అన్ని భాషల్లోనూ ఉండే ఉంటాయి. ఎందుకంటే, మన చేతగానితనానికి ఎవడినో నిందించటం సిసలైన భారతీయ సంప్రదాయం. దీని సాధనలో తరాలకు తరాలే తరించటమనేది తెలంగాణకో, తెలుగునాటికో, తమిళనాడుకో మాత్రమే పరిమితమైన గుణం కాదు. అదొక జాతీయ లక్షణం. జాతుల గుణగణాల్లోంచి కాక గాల్లోంచి పుడతాయా జాతీయాలు? మరి సదరు గుణాన్ని సొమ్ము చేసుకోటానికి ముందుండేదెవరయ్యా అంటే .. ఇంకెవరు, మన మహా నేతలే. మన మేడిపండు ప్రజాస్వామ్యంలో యథా ప్రజా, తథా రాజా. నీతిమాలిన నేతలు జాతివైరాలూ, జ్ఞాతివైరాలూ రెచ్చగొట్టి తెచ్చిపెట్టిన మహా ప్రపంచ యుద్ధాలు మానవాళికి చేసిన చేటేమిటో చరిత్రలో చదువుకున్నాం. వాటి నుండి పాఠాలు నేర్చుకుందాం. జాతీయ లక్షణం జాతీయ విపత్తుగా మారక ముందే మేలుకుందాం.

**పదో అబద్ధం:**

మాది అభివృద్ధి సమస్య కాదు .. ఆత్మగౌరవ సమస్య

**ఇదీ నిజం:**

వేర్పాటువాదుల తూణీరంలో మాయా బాణాలన్నీ ఐపోయాక, వాటిలో ఏ ఒక్కటీ లక్ష్యాన్ని తాకక, చివరాఖరికి ప్రయోగించిన అబద్ధపుటాస్త్రమే ఈ ఆత్మగౌరవ నినాదం. తెలంగాణ గౌరవంపై జరుగుతున్న దాడి అంటూ వాళ్లుదహరించే విషయాలు హాస్యాస్పదం: తెలంగాణలో ఆంధ్రా హొటళ్లున్నాయి కానీ ఆంధ్రాలో తెలంగాణ హొటళ్లేవీ, సమ్మక్క సారక్క జాతర ఆంధ్రప్రదేశ్‌లో ఇంకెక్కడా చెయ్యరెందుకు .. ఇలాంటివి. వాటిలో నిజానిజాలెంతనేదీ ఇంతకు ముందే వివరంగా చూశాం. తెలంగాణ పరువుకి భంగమేదన్నా కలిగిందంటే – అది నోటికొచ్చినట్లు పొరుగు ప్రాంతీయుల్ని తూలనాడి అదేమంటే 'ఇదే తెలంగాణ భాష, ఇదే తెలంగాణ సంస్కృతి' అనే ప్రబుద్ధుల వల్లే. ఆ విషయం తెలుసుకోలేకపోటానికి ప్రజలంత పిచ్చివాళ్లు కాదు. ఎవరివల్లో వాళ్ల గౌరవానికి తూట్లు పడుతున్నాయనుకున్నప్పుడు ఎవరూ తట్టిలేపనవసరం లేకుండానే లేస్తారు, తడాఖా చూపిస్తారు. గతంలో అలా జరిగిన సందర్భాలు ఒకటికి రెండున్నాయి. వాటి జ్ఞాపకాలింకా జనం తలపుల్లో తాజాగానే ఉన్నాయి.

ఆత్మగౌరవ నినాదాన్ని జనరంజకంగా మలిచి, ఆరు కోట్ల ఆంధ్రులకి ఆశాకిరణంగా నిలిచి, ఆంధ్రా సీడెడ్ నైజాముల్లో అసంఖ్యాక హృదయాల్ని గెలిచి – తెలుగోడి దమ్ము చూపుతూ, దశాబ్దాలపాటు సింహాసనంపై తిష్టవేసుక్కూర్చున్న కాంగిరేసు కేతిగాళ్ల దుమ్ము రేపుతూ – ఇరవయ్యేనిమిదేళ్ల కిందటో పెద్దాయన అదిరిపోయే విధంగా అధికారంలోకొచ్చాడు. అయితే నాటి కథలో అసలు నాయకుడు సదరు తెర తార కాదు. అతడో ఆయుధం మాత్రమే; అతడో అవకాశం మాత్రమే. ఆ మహా విజయంలో అతడు కేవలమో పాత్రధారి. సూత్రధారులు తెలుగు ఓటర్లు. వాళ్ల ఆవేదనా, ఆవేశమూ ఎవరో రేపెడితే రాత్రికిరాత్రి పుట్టుకొచ్చింది కాదు. సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రే ఢిల్లీ దేవత చిన్న కొడుకు కాలి జోళ్లు మోసే స్థితికి దిగజారిన తెలుగుజాతి పరువుప్రతిష్టల్ని మౌనంగా గమనిస్తూ, కాంగీ కామందులకి బుద్ధి చెప్పే తరుణం కోసం నిరీక్షిస్తున్న తెలుగువారికి అతడి రూపంలో అనుకోకుండా రామబాణమొకటి దొరికింది. పెల్లుబికిన పౌరుషంతో దాన్ని గురిపెట్టి కొడితే హస్తిన కుంభస్థలం భళ్లున పగిలింది. అదీ – ఆత్మగౌరవం అంటే. మార్పు కోసం తామిచ్చిన తీర్పుని అపహసిస్తూ, నాటి అధిష్టానాధిదేవత బుర్ర తిరిగేలా తామేసిన తారక మంత్రానికి రెండేళ్లు తిరిగేలోపే దొంగదారిలో తిరుగుబడి చెయ్యబోయిన కుటిల యత్నానికి అదే ఆత్మగౌరవం అంతకు మించిన స్థాయిలో ఉవ్వెత్తున మళ్లీ ఎగసిపడి అడ్డుపడింది, ఊరూవాడా ఏకం చేసింది, గల్లీ నుండి ఢిల్లీదాకా దద్దరిల్లజేసింది. కానీ – ఆ తర్వాత పదకొండేళ్లకి – ఆ తెరవేలుపే మరో మారు పదవీచ్యుతుడైతే చోద్యం చూశారే తప్ప ఆత్మగౌరవం పేరుతో ఆదుకోలేదు ఆంధ్రులు. ఎందుకు? ఈ తడవ గొడవ ఆయన ఇంటి సమస్యే తప్ప తమ ఆత్మగౌరవ సమస్య కానే కాదన్న ఇంగితం ఉండటం వల్ల.

చెప్పొచ్చేదేమంటే – తెలుగు వోటర్లెంత అమాయకులైనా, ఏది తమ ఆత్మగౌరవ సమస్యో, ఏది నేతల బతుకుతెరువు సమస్యో తేల్చుకోగల తెలివితేటలు పుష్కలంగా ఉన్నవారే. ఆత్మగౌరవం అనేది ఎవరికి వారికి అనుభవమయ్యేదే తప్ప ఎవరో రెచ్చగొడితే గుర్తుకొచ్చేది కాదు. అదేమీ అంగడి సరుకు కాదు, అవసరమొచ్చినప్పడల్లా కేజీల్లెక్కన కొనుక్కోటానికి. బొంత పురుగుల్ని

కావులించుకుంటేనూ, బొందలు పెడతామని కావుకావుమంటేనూ, ముక్కు నేలకి రాయిస్తేనూ, మూర్ఖపు వాదాలు చేస్తేనూ, సెలైన్ దీక్షలతోనూ, అమాయకుల (ఆత్మ)హత్యలతోనూ సిద్ధించే వరం కాదది. అడుక్కుంటే వచ్చి వళ్లో పడేదీ కాదది. తొడ కొట్టి సాధించుకోవాల్సిందది. ఆ కలేజా వేర్పాటువాదులకేదీ? అదే ఉంటే ఉడుకురక్తం విద్యార్ధుల్ని రెచ్చగొట్టి ఆత్మహత్యలకు ఉసిగొల్పి తాము మాత్రం తాపీగా ఆ మంటల్లో చలికాచుకుంటూ ఆత్మగౌరవ జపాలు పఠిస్తారా? వాళ్లకి నిజాయితీయే ఉంటే నిజాముని పొగిడిన నోటితోనే ఆత్మాభిమానం గూర్చిన పాఠాలు వల్లెవేస్తారా? తెలంగాణ ఆత్మగౌరవానికి నిజంగానే భంగం కలిగుంటే, మెజారిటీ తెలంగాణవాసుల్లో ఆ భావన నిజంగానే ఉంటే .. ఆత్మగౌరవం పేరుతో రేయీపగలూ రచ్చ చేస్తున్న రాజకీయ పక్షానికి ఏ ఒక్క ఎన్నికలోనూ ఏకపక్ష విజయం దక్కలేదేం? ఆ పార్టీ పరిస్థితి నానాటికీ తీసికట్టుగా తయారై ఆఖరుకి, ఏ హైదరాబాదు కోసమైతే ఈ నాటకం మొదలెట్టారో ఆ మహానగరం స్థానిక ఎన్నికల్లోనే పోటీ చెయ్యలేక ముఖం వేలాడేసిందేం?

పదేళ్లుగా పదే పదే చదువుతున్నా ఆత్మగౌరవ మంత్రం ఆశించినన్ని చింతకాయలు రాల్చలేదన్న గ్రహింపుతో వేర్పాటువాదులు ఈ మధ్యనే ట్యూను మార్చారు. ఆత్మగౌరవానికి స్వయంపాలననే తోక తగిలించారు. ఇప్పటిదాకా మోతమోగించిన అభివృద్ధిలేమి, వెనుకబాటుదనం, వగైరా, వగైరా అసలు సమస్యలు కావట. ఇది వాళ్లని వాళ్లే పరిపాలించుకోటానికి చేస్తున్న ఉద్యమమట! అద్దిరబన్నా .. అనుకోకుండానైనా, అసలు విషయం బయట పెట్టేశారు దొరలు. ఇదంతా పదవుల పందేరానికి సంబంధించిన విషయం. ఆంధ్ర ప్రదేశ్‌లో ఉంటే అధికారం మరో రెండు ప్రాంతాల నేతలతో పంచుకోవాల్సొస్తుంది కాబట్టి ప్రత్యేక రాష్ట్రం కోసం రగడ మొదలెట్టారన్న మాట – అలాగైతే అధికారం తామూ, తమ తరతరాల వారసులూ అనుభవించొచ్చనే దుగ్ధతో. తెలంగాణనో నయా జాగీరుగా మార్చేయాలన్నే కుట్ర ఇదంతా. పదవి రాని బాధలో వేర్పాటువాద భూతానికి ఊపిర్లూది ఊతమిచ్చిన ప్రబుద్ధుడి బుద్ధి అంతకన్నా గొప్పగా ఏముంటుంది గనక. తెలంగాణకి ఇన్నేళ్లుగానూ చట్టసభల్లో ప్రాతినిధ్యం లేకపోయినా, అక్కడివారెవ్వరూ మంత్రి పదవులూ ఏ ఇతర అధికారాలూ వెలగబెట్టకపోయినా ఈ స్వయంపాలననే వాదనకి అంతో ఇంతో విలువుండేది. సరే, వితండవాదులకి లాజిక్కులతో పనుండదు కదా. వాళ్ల పైత్యం వాళ్లదే. ఆ పైత్యం ముదిరి ఆంధ్రా వస్తువుల్ని బహిష్కరిద్దాం, ఆంధ్రోళ్లని తన్ని తరిమి కొడదాం అనేదాకా వచ్చింది. రేపో మాపో ఇది పన్నులు ఎగ్గొడదాం అనేదాకా వెళ్లినా ఆశ్చర్యం లేదు.

విదేశీయులేసిన దాస్య శృంఖలాల నుండి భరతజాతిని విముక్తం చేసే క్రమంలో, కుల మత ప్రాంత వర్గ భేదాలకతీతంగా దేశాన్ని ఒక్క తాటి మీదకి తెచ్చే సత్సంకల్పంతో అసలు సిసలు దేశోద్ధారకులు పుట్టించిన పదాలు స్వయంపాలన, సహాయ నిరాకరణ, వస్తు బహిష్కరణ, ఇత్యాదివి. అవి ప్రజల్లో దేశభక్తిని రగిల్చాయప్పుడు. తెలుగుజాతిని రెండుగా విడగొట్టి పబ్బం గడుపుకునే కుయత్నంలో ఆ పదాలని హైజాక్ చేసి వాటికి తమ చిత్తమొచ్చిన అన్వయాలిచ్చేసి సొంతవారిపైనే ఇష్టమొచ్చినట్లు ప్రయోగించే స్వార్ధపరుల దుష్టతంత్రాన్ని విస్తుపోయి చూడటం విజ్ఞుల వంతైందిప్పుడు. పైగా దానికి సమర్ధనగా – నేటి వేర్పాటువాదానికి నాటి స్వతంత్రపోరాటంతో నిస్సిగ్గుగా పోలిక పెట్టే విపరీత పోకడలు!

చైనా ఉత్పత్తుల్లేనిదే అమెరికాలో ఏ ఇల్లూ నడవని రోజులివి. గ్లోబలైజేషన్ పుణ్యాన ప్రపంచమే ఓ కుగ్రామంగా మారిపోయిన ఈ కాలంలో ఒకరిపై ఒకరు ఆధారపడనిదే ఏ వ్యక్తీ, సమాజమూ మనగలిగే అవకాశం లేదు. అలాంటి పరిస్థితుల్లో ప్రాంతీయ అంతరాలు పెంచటం ద్వారా తెచ్చుకునే తెలంగాణ రాష్ట్రం – అది వస్తే గిస్తే – తెలంగాణవాసులకి ఏ రకంగానూ ఉపయోగపడదన్న నిజం

పట్టించుకోని కుక్కమూతి పిందెల్లాంటి నేతలు, మేధావుల ముసుగులో వాళ్లకి వంతపాడే భూత ప్రేత పిశాచ వందిమాగధ గణాలూ కలసికట్టుగా ఆ ప్రాంతానికి ఇప్పటికే చేసిన, ఇంకా చేస్తున్న చేటు అంతా ఇంతా కాదు. ఆ సంగతి వాళ్లకి తెలీదా? తెలిస్తే, ఈ రభసంతా ఎందుకు?

ఎందుకో మీకు తెలుసు.